అ మ రా వ తి

(పద్యకావ్యము)

ఈ స్వాతంత్ర్య నవోదయారుణరుచుల్ హేరాళమై పర్వ ప్రా
ప్త స్వారాజ్య శతాంగ చోదనకళా ప్రాగల్భ్య మర్థించి, నూ
త్నస్వాదిష్ఠ మనోజ్ఞ కావ్యరస తృప్తస్వాంతులై నేఁటి యాం
ధ్రస్వాము ల్గడియింత్రు గావుత విజౌన్నత్య ప్రభావంబులన్.

కొండూరు వీరరాఘవాచార్యులు

తెనాలి

అమరావతి : మూల్యము రు. **5-00**

అమరావతి

(పద్యకావ్యము)

ఈ స్వాతంత్ర్య నవోదయారుణరుచుల్ హేరాళమై సర్వప్రా
ప్తస్వారాజ్య శతాంగ చోదనకళా ప్రాగల్భ్యు హర్షించి, స
త్నస్వాదిష్ఠ మనోజ్ఞ కావ్యరస తృప్తస్వాంతులై నేఁటి యాం
ధ్రస్వాముల్గడియింత్రు గావుత విశాలౌన్నత్య ప్రభావంబులన్.

కొండూరు వీరరాఘవాచార్యులు

తెనాలి

శ్రీ వీరరాఘవ గ్రంథావళి

అమరావతి

[Prescribed for the B. A. Class by the Madras University 1953]

శిల్ప సాహిత్యములు నాకు జీవగఱ్ఱలు-
ఔపనిషద వనాలు విహారవీధులు-
ఈ చరాచరాత్మక జగద్ధితము వ్రతము
నడపు మిటు నాదు జీవిత నాటకమ్ము.

దర్శనాచార్య– కళాప్రపూర్ణ
డాక్టర్: కొండూరు వీరరాఘవాచార్యులు
తెనాలి

ప్రథమ ముద్రణము 1950

ద్వితీయ ముద్రణము 1951

తృతీయ ముద్రణము 1966

చతుర్థ ముద్రణము 1979

ప్రకాశకులు : గ్రంథకర్త,
గాంధీనగర్, తెనాలి.

1000 ప్రతులు రూ. 10/-

అభిప్రాయములు

కృష్ణాపత్రిక.

"నవ్యాంధ్రసాహిత్య సంస్థానాస్థానంలో సరస్వతీ సింహాసనానికి సమీపంగా ఒక ప్రముఖస్థానం అలంకరింపతగ్గ శిల్పకావ్యం అమరావతి. విద్వత్సంస్తవనీయమైన యీయన కవితావేశానికి పూర్వ సంస్కారంతో బాటు అభిజనగౌరవంకూడ ఒక మూలకారణమైంది. ఈయన ప్రత్యణువు లోను వైదికశిల్పర్షి సంప్రదాయ ప్రభావం అనేకశః గోచరిస్తుంది.

అపరిమితమైన ఆంధ్రాభిమానమూ, అకలుషమైన బౌద్ధధర్మాసక్తి, అక్షీణ పరంపరాగతమైన శిల్పకళాభిరతీ, అవేలమైన కవితావేశమూ, అనల్పములైన ఔచితీపాలనములతో అమరావతీ కావ్యరచన రమణీయంగా సాగింది. ప్రాచీనాంధ్రశిల్ప నాగరికతా వైభవాన్ని ప్రదర్శించి ఆంధ్రి హృదయాలను ఉత్తేజితములుగాచేసి స్వధర్మానుష్ఠానతత్పరములుగా చేయ గల యీ నవ్యకావ్యం కవిగారి సామర్థ్యమునకూ, వ్యుత్పత్తి వికసితమైన ప్రతిభకూ, విజయగీతము లాలపిస్తూ సహృదయ హృదయాహ్లాదం కలిగిస్తున్నది."

ప్రగతి

"ఆచార్యులవారు పండితులు. ప్రతిపద్యపాదమును ఈవిషయమును చాటి చెప్పును. వారిధార అమోఘము. అతిసరళము. ఏపద్యము చదివినను ఇది భావప్రధానమా? భాషాప్రధానమా? అని తబ్బిబ్బు పడుదుము. ఉత్తమ కవిత్వమున కాయువుపట్టగు అకృత్రిమత్వ మిందు వెల్లివిరిసి పాఠకుల నుఱ్ఱూత లూపుచున్నది. "హంపీక్షేత్రము" నందలి ధార, "సౌందరనందము" నందలి మనోహరతా సారళ్యములు వీరి యమరావతి యందు గలవు. ఆచార్యులవారి కవితాసామగ్రి విశ్వశ్రేయమున కుపయోగింపగలది..... ."

ఆంధ్రప్రభ

"అమరావతీ మహోజ్జ్వలగాథను వస్తువుగా చేసుకొని వ్రాసిన తొలికావ్యం ఇదే........ బౌద్ధాన్ని కేవలం మతదృష్ట్యామాత్రమే కాకుండా సాంఘిక రాజకీయదృష్ట్యా చూడడం ఈకవిలోని ఒక విశేషం. ఈనాటికీ అపరిష్కృతంగా మానవజాతిని పీడిస్తున్న సకల జీవితసమస్యలకూ పరిష్కార మార్గాలు బౌద్ధమతం చూపగలదని నిరూపించినాడు కవి.... ... అమరావతి శిల్ప శిథిలాలనుజూచి కవిపొందిన దుఃఖావేశం ఇంతంతకాదు. "పిచ్చి మతాభిమాన మెదవేర్చుటచే" జరిగిందే యీబౌద్ధమత విధ్వంసం ... విచ్ఛిన్న శిల్పకృతులను గాంచి కవి కార్చిన కన్నీరు కావ్యాన్ని ఒక కరుణ వాహినిగా మారుస్తుంది.... ...."

విజయప్రభ

"అమరావతిలో కవి ఆంధ్రాభిమానము, శిల్ప కళారసజ్ఞత, బౌద్ధ మత సిద్ధాంతముపట్ల యీయనకుగల అత్యంతాదరము ఒక దానినిమించి ఒకటి కొట్టవచ్చిన ట్లీకావ్యమున కనిపించుచున్నవి. కావ్యము నాతిసమాస భూయిష్ఠమై, వైదర్భీరీతిలో మనోహరమై, ఎచట ముట్టినను కవిప్రతిభను చిప్పిలజేయుచున్నది. ప్రాచీనవైభవమును చవిచూపి పునః ఆంధ్రులను ఉత్తేజితులను జేయగల సామర్థ్యమును పుష్కలముగా గలిగిన యీ మధుర కావ్య మాంధ్ర రసజ్ఞ లోకాదరణీయము కాగలదనుట నిజము."

—o—

పురావలోకనము

అమరావతి పేరు విన్నంతనే ప్రతి ఆంధ్రుని హృదయముకూడ ఉప్పొంగిపోవును; ప్రతి భక్తుని చిత్తముగూడ భక్తితో తన్మయమగును. ప్రాచీనకాలపు విజ్ఞాన వైభవమునకు, శిల్పకళా ప్రాభవమునకు, అఖండబౌద్ధసంస్కృతికి గురుపీఠమై దేశ దేశాంతరములలో నాగరికతా దీప్తులను ప్రసరింపజేసిన అమరావతి ఆంధ్రులకేకాదు, భారతీయుల కందఱికిని ఆరాధింపదగిన పవిత్రస్థానము! స్మరింపదగిన చారిత్రక ప్రదేశము.

శాతవాహన రాజులు మగధనుండి కన్యాకుమారిదాక దక్షిణాపథ మును పాలించెడి రోజులలో కృష్ణానది యొడ్డున నున్న ధాన్యకటకము దక్షిణదేశపు నగరముల కన్నింటికిని తలపూవై ప్రకాశించినది. క్రీ. శ. 3 వ శతాబ్దికి పూర్వమే - దక్షిణమున కాంచీనగరము ప్రాధాన్యమును పొందకమునుపే ఈ ధాన్యకటకము గొప్ప విద్యాస్థానముగను, బౌద్ధ మత ప్రధాన పీఠముగను వన్నె కెక్కినది. ధాన్యకటకము నాదినము లలో ధనకటకమని గూడ పిలుచుచుండెడివారు. ప్రస్తుత మిది ధరణి కోటగా మాఱినది. పూర్వకాలమునుండియు ఈ ధ్యానకటకములో బుద్ధుని పూజ, అమరేశ్వరస్వామి పేర శివునిపూజ బహుళముగా జరుగుచున్నవని శాసనములవలన తెలియుచున్నది. అమరేశ్వరస్వామి గల పట్టణభాగము కాలక్రమమున అమరావతి అయినది. అనఁగా రెండు వేల సంవత్సరము లకు పూర్వము శాతవాహ నాంధ్రరాజులకు రాజధానియై యొప్పిన ధాన్య కటకము ధరణికోట, అమరావతి అను రెండుగ్రామములుగా రూపొంది మనకు దర్శన మిచ్చుచున్నదన్నమాట.

వ్యాప్తము చేయనెంచి దేశదేశములకును బౌద్ధభిక్షువులను ప్రచారకులనుగా పంపినాడు. అట్టి వారిలో ఆంధ్రదేశమునకు వచ్చిన బౌద్ధమతప్రచారకుడు మహాదేవ భిక్షువు. ఈతడు మగధకు ముఖ్యపట్టణమయిన పాటలీపుత్రము లోని మహాసాంఘికులకు నాయకుడు. ఈమహాదేవభిక్షువు ధాన్యకటకమును నివాసముగా చేసికొని, శాతవాహన భూపాలుర యాదరాభిమానములను చూఱగొని బౌద్ధమతములో "చైత్యకవాద" మనునొక సంప్రదాయమును స్థాపించినాడు. మహాసాంఘికవాదమునకు చెందిన యీ బౌద్ధము ఆంధ్ర దేశములో వ్యాపించుటకు మహాదేవ భిక్షువు నాంధ్రమునకు పంపిన అశోక చక్రవర్తి యెంతయును స్మరణార్హుడు.

అమరావతి ప్రాచీన శోభను స్మరింపజేసెడు ముఖ్యచిహ్నము "అమరావతీ స్తూపము". ఈ స్తూపపు కట్టడములను చూచినచో ఇది ఒక్కసారిగా నిర్మింపబడలేదనితోచును. ఇందలి ప్రాచీన నిర్మాణ రీతు లను బట్టి ఈ స్తూపము క్రీ. పూ. రెండు మూడు వందల సంవత్సరముల నాటిదని గట్టిగా చెప్పవచ్చును. బుద్ధుడు నిర్వాణము చెందిన పిమ్మట అతని శరీరావశేషములను పెట్టి ఎనిమిది ప్రధానస్తూపములను ఆయా తావుల గట్టించి రనియును, వానిలో నొకటి అమరావతీ స్తూపము కావచ్చు ననియును కొందఱి యూహ. అశోకుడు బౌద్ధమతమును విస్తరింపజేయ దలచి ఆ ప్రధాన స్తూపములలో నేడింటిని తెఱపించి యందలి యెముక లను ఎనుబదినాలుగువేల ముక్కలుచేసి వాటితోఆయా తావులలో బౌద్ధస్తూప ములను నిర్మింప జేసినాడట. అట్టి శారీరక ధాతువులు గలవియే అమరా వతి-నాగార్జున కొండలలోని స్తూపములని కొందఱభిప్రాయపడుచున్నారు. ఏది యెట్లయినను ఆంధ్రవంశీయులగు శాతవాహనులు బౌద్ధమతము నాదరించి, అమరావతీ చైత్యమును బహురీతుల పెంపొందించినారు. క్రీ. పూ. 200 సంవత్సరములనుండియు క్రీ. త. 300 సంవత్సరముల

వలఱకును అమరావతిలోని యీ స్తూపము, బౌద్ధవిజ్ఞానము, ఆంధ్రుల ప్రతిభ మూడు పూవులు ఆఱుకాయలై పెంపు చెందినవి.

కరుణామయులగు బౌద్ధమత ప్రచారకులు తమ బౌద్ధవిహారములను, స్తూపములను, చైత్యములను నదీతీరప్రదేశములందు సృష్టించినారు. ముఖ్యముగా ప్రయాణసౌకర్యము నుద్దేశించి ప్రచారము బాగుగా సాగునని వారీ యేర్పాటు చేసియుండవచ్చును. కృష్ణానది యొడ్డున అమరావతి, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, ఘంటసాల మున్నగు తావుల బౌద్ధక్షేత్రములు వెలసియున్నవి.

ఆంధ్రదేశపు బౌద్ధక్షేత్రములలో అమరావతి శిరోమణి వంటిది. ఇది బౌద్ధమతమునకూ, ఆంధ్రసంస్కృతికీ, అనుత్తమ శిల్పకళకూ నివాసమగుటయే కాక, సుప్రసిద్ధ విశ్వవిద్యాలయమై కూడ కీర్తిగాంచినది. వైదిక యుగములో బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకును అందును ముఖ్యముగా బ్రాహ్మణులకును మాత్రమే చదివెడు నధికారముగల వేదాది విద్యలు బౌద్ధయుగములో మానవమాత్రుల కెల్లరికిని పఠనీయము లైనవి. వర్ణభేదములు బౌద్ధమతములో లేవు. ఎవడు విజ్ఞానవంతుడో, సదాచార పరాయణుడో, వాడే బౌద్ధుల దృష్టిలో పూజనీయుడు ఈ విధములైన విశ్వజనీన భావములతో ఆనాటి సంఘమునకు బుద్ధుడు పూజనీయుడైనాడు; బౌద్ధవిజ్ఞానము ఆదరణపాత్ర మయినది.

విద్యావ్యాప్తికి అమరావతి గురుపీఠమై వేలకొలది శిష్యులకు విద్యాదానము చేసెడి మహాచార్యులతో నిండియుండెడిది. భారతదేశము నలుమూలల నుండియేగాక, అన్య దేశములనుండియును వేనకువేలు విద్యాభిలాషు లిచ్చటికి వచ్చి విజ్ఞానమును గఱచి పోవుచుండెడివారు. దేశ దేశములనుండి వచ్చి, సాంఘికాధ్యాత్మికాది విషయములను జర్చించెడు

మహావ్యక్తులతో నీ సంఘారామము కళకళ లాడుచుండెడిది. ఆనాటి అమరావతీ విశ్వవిద్యాలయములో ఏ యే విజ్ఞాన సాగరములు మథింప బడుచుండెడివో, ఏ యే కళ లభ్యసింప బడుచుండెడివో, ఆశోభ యెంతగా నుండెడిదో ఎవరు చెప్పగలరు ! ఆ నాటి ఆంధ్రుల వైభవమును రాయ ప్రోలు కవి "అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాడు" అని స్మరించుకొన్నాడు.

బౌద్ధమతస్థులకు రెండవ బుద్ధుడు వలె పూజనీయుడైన నాగార్జునా చార్యుని కాలములోని అమరావతీవిద్యాపీఠము నాదర్శముగా తీసి కొని "టిబెట్టు" దేశములోని "లాసా" నగరమునకు సమీపముననున్న "దాపంగ్" సంఘారామము నిర్మింపబడినది. "దాపంగ్" అనగా టిబెట్టు భాషలో ధాన్యరాశి యని యర్థము. మన అమరావతి పూర్వనామము ధాన్యకటకము కాబట్టి టిబెట్టు బౌద్ధులుకూడ ఆ పేరుతోనే విద్యాలయమును స్థాపించినారు. అన్యదేశములకు కూడ ఆదర్శప్రాయమైన విద్యాపీఠమును నిర్వహించిన అమరావతి, ఆంధ్రదేశము ఎంత అదృష్టము కలవో చూడుడు ! దాపంగ్ విద్యాపీఠములో 7700 బౌద్ధభిక్షువులుండెడివారు. ఆఱు కళాశాలలుగల విశ్వవిద్యాలయ ముండెడిది. ఇట్టి వివరము లన్ని యును అమరావతిని గూర్చి గూడ తెలిసికొనుటకు దురదృష్టవశాత్తు మన బౌద్ధవాఙ్మయము నాశనమయి పోయినది. బౌద్ధయుగములో ఉత్తరహిందు స్థానమున తక్షశిల, నాలంద, దంతపురి మున్నగు విద్యాపీఠములు ప్రసిద్ధ ములు కాగా, దక్షిణ భారతమున ధాన్యకటకము, వేగి, కాంచీపురము, శ్రీగిరి (అనగా నాగార్జునకొండ) మున్నగునవి సుప్రసిద్ధ విద్యాపీఠములై ప్రకాశించినవి.

అమరావతీ స్తూపమును నాగార్జునుడుగూడ బాగుగా నభివృద్ధి చేసినాడు. స్తూపమునకు చుట్టునున్న ప్రాకార మీతడు కట్టించినదే. ఇతడు

సాతవాహనునకు వ్రాసిన "సుహృల్లేఖ" అద్భుతమైనది. ఈతని పేర వెలసిన నాగార్జునకొండ మహిమ, శిల్పసంపద నేటికిని మనము చూచుచునే యున్నాము.

మహాదేవభిక్షునిచే ఆంధ్రదేశములో ప్రచారము చేయబడిన —మహాయానశాఖకు జెందిన బౌద్ధవిజ్ఞానము ఒక్క ఆంధ్రదేశములోనే ఉండిపోక ఉత్తరాన టిబెట్టువఱకును, దక్షిణాన సింహళద్వీపమువఱకును గూడ వ్యాపించినది. సింహళద్వీపములో "అనూరాధాపురము"న మహాస్తూపము నిర్మింపబడు నపుడు ఆంధ్రదేశమునుండి వెడలిన బౌద్ధాచార్యులలో మహాదేవభిక్షు వొకడు. ఇతడు పల్లవభోగ మని పిలువబడెడు ఇప్పటి పలనాటినుండి నాలుగులక్షల అఱువదివేల భిక్షువులను వెంట దీసికొనిపోయి, సింహళద్వీపములోని స్తూపస్థాపనలో పాల్గొని బౌద్ధవిజ్ఞానమును ప్రచారము చేసినాడు. ఈతని వెంట ఎంత ఆంధ్రసంస్కృతీ, ఆంధ్రశిల్పమూ అక్కడికి దిగుమతియైయుండునో ఊహింపుడు.

మనస్సును మోహముగ్ధ మొనర్చి ఉద్రేకమును గలిగించెడి సుందర వస్తువులను చూచుట, నిర్మించుట, ఆరాధించుట కూడదని బుద్ధుడు నిషేధించినాడు. అయినను సంసారతరణమునకు మార్గముచూపిన బుద్ధదేవుని యందలి భక్త్యతిశయము తరువాతి బౌద్ధులలో భక్తిపూర్వకమైన కళాభిరతిని నెలకొల్పినది. ఈదృష్టితో వారు బుద్ధుని స్వరూపమును శిలలమీద తీర్చియు, చిత్తరువులుగా వ్రాసియు తమ కృతజ్ఞతా పూర్వకమైన భక్తిని వెల్లడించుకొనువారు. క్రమక్రమముగా బుద్ధుని జీవిత గాథలు, అమ్మహా జీవిత ఘట్టములు, చరిత్రలు, శిల్పముగా రూపొందినవి. బుద్ధదేవుని పూర్వజన్మములందలి గాథలగు జాతక కథలనుగూడ శిలలపై చిత్రించుటకు బౌద్ధులు పూనుకొన్నారు. సామాన్యమైన మతచిహ్నముగా నుండవలసిన స్తూపముమీదగూడ అఖండమైన శిల్పమును దిద్దుటకు సంసిద్ధు

లైనారు. ఈవిధముగా విగ్రహారాధన లేని మతములో బుద్ధారాధన మొదలైన క్రియలద్వారా శిల్పకళ, సౌందర్యపూజ తావు చేసికొన్నవి. వేయేల, బుద్ధారాధన తాత్పర్యముతో బౌద్ధులెన్నియో మహాశిల్ప కావ్యములను నిర్మింప జేసినారు.

బౌద్ధ యుగమునాటి శిల్పాచార్యుల సిద్ధహస్తాలలో రూపొందిన కళాసామగ్రిలో స్తూప నిర్మాణ మొకటి. ఈ స్తూపనిర్మాణములలో అమరావతీస్తూప శిల్పసౌందర్యము దేశ దేశములూ కొనియాడదగినది; త్రిజగన్మోహనమైనది. ఆ 'ఆయకకంబాలలో, ఆ ప్రాకారపు గోడమీద, ఆస్తూపపు అండాకృతిలో ఎన్నెన్ని విగ్రహాలు, ఎన్ని గాథలు, ఎంతటి దైవశిల్పము మూర్తీభవించిన దనుకొన్నారు ! ఆ అధిష్ఠాన చిత్రములను తిలకింపుడు. ఆ ఊర్ధ్వపటచిత్రాలు చూడుడు. ఎంత అమానుషశిల్పము తాండవించుచున్నదో ! ఆ ఉష్ణీషచిత్రాల మీదిదంతా దైవశిల్ప మన్నచో అతిశయోక్తిగాదు. చైత్యశిలాఫలకాలమీద కొలువుదీఱియున్న బుద్ధమూర్తి, ఆయనను పరివేష్టించిన ఆ పరివారమూ యథార్థముగా ఆకాలపు బుద్ధుని ధర్మసభనే తలపించుచున్నవి. ఆహా ! ఆ ఒక్క యక్షిని తీర్చుటకే మన ఆంధ్రశిల్పి తన జీవితమును ధారపోసి యుండవచ్చును. ఆ ధర్మచక్ర స్తంభపు సోయగము, ఆ వేదికావృత్త చిత్రము, ఆ బుద్ధదేవుని పాదాలు ఎంత అందమును చిందుచున్నవి ! ఇవి యంతయు సౌందర్యపుపోత. చితికి జీర్ణించిన ఈ శిలాఖండములు ఎంతటి శిల్పోదంతమును, సౌందర్యమును చాటుచున్నవి ! ఆంధ్రశిల్పాచార్యుల ఈ అతిలోక శిల్పచాతుర్యము అమరావతీ స్తూపకృతికి అనన్యశోభను చేకూర్చి, భారతీయ శిల్ప సంప్రదాయములలో "అమరావతీరీతి" అను నొక ప్రత్యేకస్థానమును సంపాదించుకొన్నది ఈ విషయము డా॥ ఆనంద కుమారస్వామి ప్రభృతుల గ్రంథాలలో సుస్పష్ట మగును.

అమరావతి సారస్వత విద్యావిషయములో, సంస్కృతిలో ఎంతగా మిన్నందినదో అంతకు వేయిరెట్లెక్కువగా శిల్పకళా ప్రౌఢిమలోను గురుపీఠమును బొంది అతిశయించినది. అమరావతీ శిల్పకళ దేశీయము కాదనియు, గ్రీకులనుండియో, రోమనులనుండియో ఈకళ నాంధ్రులు నేర్చుకొన్నారనియు కొందఱు చేసెడి వాదము సత్యదూరము. దాక్షిణాత్య శిల్పరీతులు, మనశాస్త్రానికి, సంప్రదాయమునకు అనుసంధించు కళామార్గములు అమరావతీ శిల్పములో మూర్తీభవించి యుండుటచేత పైవాదము అంగీకార్యము కాదు. ఆంధ్రదేశ శిల్పుల దివ్యశిల్ప కళాకౌశలమే యిది అంతయునని నిరూపింపవచ్చును.

పూర్వము నాగార్జునకొండకు దగ్గఱగా "పెందోట" (బృహద్వని) అను ప్రసిద్ధ నగరరాజ ముండెడిది. అది మహాశిల్పాచార్యులకు నివాసమైనది. ఆ పెందోట శిల్పులే దేశమున శిల్పకళా తోరణములు ప్రేలగట్టినారు. వారి చేతిచలువ వలననే అమరావతి, నాగార్జునకొండ మున్నగు బౌద్ధక్షేత్రములలో అతిలోక శిల్పము వెలసినదని సంప్రదాయజ్ఞులైన పురాణికులు చెప్పుచున్నారు. ఈ శిల్పాచార్యులకు "పెందోట పురవరాధీశ్వరు" లను బిరుదముగూడ గలదు. ఇది విశ్వకర్మపురాణాది గ్రంథములలో స్పష్టముగా చేర్కొనబడెను. నేటికిని విశ్వబ్రాహ్మణులను యాచించు పనసలు, రుంజవాండ్రు- వారి కైవారములలో "పెందోట పురవరాధీశ్వరు" లని విశ్వకర్మీయులను చేర్కొనుట ఆచారమైయున్నది. దీనినిబట్టి శాతవాహనుల కాలమున పెందోట, అక్కడి మహాశిల్పులు ఒక్క వెల్గు వెలిగినట్లు విస్పష్ట మగుచున్నది. పురవరాధీశ్వరులను బిరుదు వీరికి రాచఠీకమును బట్టి వచ్చినది. పెందోట చిరకాలము పంచార్షేయ బ్రాహ్మణ ప్రభువుల పాలనములోనున్నది. 1379 నుండి 1630 వఱకు ధవళేశ్వరపువారు దీనిని పాలించినట్లు ప్రమాణములున్నవి. 1570 నుండి నలుబది సంవత్సరములు

శ్రీ ధవళేశ్వరపు మార్కండేయ ప్రభువు పెందోటను రాజధానిగాజేసికొని ఆంధ్రదేశమును బరిపాలించుచు "నాగరఖండము"ను కృతినందినాడు *. కాని, చరిత్ర జాగరూకతతో జారవిడిచిన యీ శిల్పుల యుదంతము ఆ పెందోట వలెనే యుత్సన్నమైనది.

కరుడు గట్టిన వేదవిజ్ఞాన రాశులనదగునా శిల్పులు బౌద్ధ ప్రేరణమున బౌద్ధకళను చిత్రించినను, వైదిక సంప్రదాయముతో దానిని చక్కగా సమన్వయించినారు. ఏ దేశపుస్తూపమునందును లేని ఆర్యక స్తంభ నిర్మాణమునందును, త్రిశూల కల్పనమునందును వీరు చూపిన బౌద్ధ వైదిక మత సమన్వయము కొనియాడ దగినది. నాగార్జునాచార్యుడుగూడ ఈ పెందోటయందలి శిల్పాచార్యుడే యని తెలియుచున్నది. ఆతడు సమీపస్థ మగు కొండ నావాసముగా చేసికొనుట, అందే స్తూప నిర్మాణము గావించుటగూడ పైవాదమునకు సహాయకారులుగానున్నవి.

ఈ విధముగా మహా శ్రోత్రియులగు పెందోట శిల్పుల చేతిలో తీర్పబడ్డ అమరావతీ స్తూపకళ విదేశీయ మను వాదము హాస్య ప్రాయము.

ఇట్లు బహుముఖముల వెలసిన అమరావతీ శిల్పచ్ఛాయల ననుసరించియే ఆ నాటి వస్త్రధారణ పద్ధతులు, నాట్యకళా విధానములు, మున్నగునవి మన మూహింపవచ్చును. నాగరికత బాగుగా పెంపొందినదని భావింపబడు నీ దినములలోగూడ తలగుడ్డలు చుట్టుటలో నేమి, వల్లెవాట్లు

---

* ఈవివరములను 1951 సం॥ ఏప్రిల్ భారతిలో "పెందోటపురము-మార్కండేయ ప్రభువు" అను వ్యాసమునను "శ్రీ వీరరాఘవ వ్యాసావళి"యందును కాంచవచ్చును.

వేయుటలో నేమి, కటివస్త్రములను గట్టుటలో నేమి ఆ "ఫ్యాషన్లు" లేవు. ఎన్నిరకముల నాట్యభంగిమలో మనము చూడ గలుగుదుము. జుట్టు కత్తిరించి మలచుటలోను, నానావిధములైన వేణీబంధములను సవరించుటలోను, ఆనాటివారి కెంతమోజో ఆ బొమ్మలను చూచినచో దెలియగలదు. యుద్ధవీరులు ఆ యా ఆయుధములను బట్టెడి రీతులు, వారి అవయవ విన్యాసములు ఎంత హృద్యములు; ఆ నాటి స్త్రీలుకూడ అత్యద్భుతాలైన అలంకారములను ధరించెడివారు. రాణులు, ధనిక స్త్రీలు నుదుటిమీదికి వ్రేలాడు పాపటబొట్టువంటి ఆభరణమును ధరించెడివారు. అమరావతీకాలపు స్త్రీలు తమ సౌందర్యమును, శృంగారమును ఎంతగా పోషించుకొనెడివారో ఆ నాటి శిల్పకృతులను జూచిన తెలియును.

ఈ పవిత్రక్షేత్రములోనే శ్రీముఖాది చక్రవర్తులు, ఆపస్తంబాది మహర్షులు, శాలివాహనాది కవిరాజులు, మహాశిల్పులు, నాగార్జునుడు, భావవివేకస్వామి, మున్నగు బౌద్ధాచార్యులు తమ వివిధ కళాప్రతిభలను వెల్లివిరియించినారు. ఆనాటి వణిక్కుల వ్యాపారనౌకలతో కృష్ణానది కళకళలాడు చుండెడిది. వివిధ పరిశ్రమలు, సాధారణ శిల్పములు జనసమూహముయొక్క నిరుద్యోగ సమస్యను దూరీకరించు చుండెడివి.

ఇంతటి సముజ్జ్వలచరిత్రకు పంటపొలమైన అమరావతి క్రీ. శ. నాల్గవ శతాబ్దినుండి బౌద్ధమతములో వచ్చిన తాంత్రిక పద్ధతి కారణముగను, రాజకీయ పరిణామములు కారణముగను, పౌరాణిక మతప్రాబల్యము కారణముగను జీర్ణస్థితికి వచ్చినది. కుమారిలభట్టు, శంకరాచార్యులుమున్నగు హైందవాచార్యుల వలన బౌద్ధమున్మూలింపబడినది. పెక్కు మతయుద్ధములలో అమరావతి దెబ్బతిన్నది. శాతవాహనులయు, ఇక్ష్వాకులయు రాజ్యము

లంతరింప - విష్ణుకుండులు, పల్లవులు, చాళుక్యులు, వాకాటకులు మొదలగు వంశములవారు పౌరాణికమతమును ప్రేమించి ప్రచార మొనర్చినారు. మఱల వర్ణవ్యవస్థ, అర్థరహితమగు తరతమభావము ప్రజలలో రేకెత్తి బౌద్ధయుగమునాటి ఆ విజ్ఞానవైభవము, ఆ కళా సంపత్తి, ఆ వీరవిక్రమము, ఆ సంస్కృతి - అన్నియు సన్నగిలి పోయినవి. ఏడవ శతాబ్దిలో "హ్యుయెంత్సాంగు" అను చీనా బౌద్ధ యాత్రికుడు వచ్చునప్పటికే ధాన్యకటక వైభవము క్షీణదశలోనున్నట్లు తెలియుచున్నది. తరువాత క్రమముగా అది యంతయు రూపటి యీ నాటికి దీపాలదిన్నె పేరు మాత్రము మిగిలినది. ఇప్పుడు మనకేమున్నది! ఆ ప్రాచీన అమరావతీ వైభవమును దలంచుకొని "అశ్రువులు రాల్తి జీవచ్ఛ వాంధ్రజనులు."

(1948 ఏప్రిల్ - భారతిలోని

"అమరావతి - విజ్ఞానపీఠము" అనునీ కవి వ్యాసము)

మనవి

లండనుకును, కలకత్తాకును నడచిపోయినవి పోగా శేషించిన అమరావతీస్తూప శిల్పఖండములను నావిద్యార్థిదశలో మద్రాసు మ్యూజియమున చూచుట తటస్థించినది. అత్యద్భుతములగు ఆకృతులు చిత్తము నాకర్షింప అమరావతీ ధాన్యకటక చరిత్రములను, అలనాటి బౌద్ధాంధ్ర వైభవమును, ఆంధ్ర సంస్కృతి విశేషములను ఆకళించుకొన బూనితిని. ఇది యంతయు నొక రమణీయ కావ్యము కాగలదని భావించి పూర్వాంధ్ర సంపత్తికెడద యుప్పొంగి యీ కావ్యమును సంతరించితిని. ఇందు కావ్యకళానిర్వహణమునకు అయ్యైకథలను, గాథలను, చరిత్రాంశములను అనువుగా పొందుపఱచుకొంటినేగాని, అభూతకల్పనలను జేయ దొరకొనలేదు. కాగా మహాదేవ భిక్షువు వచ్చునాటి కిచ్చట శాతవాహన రాజ్యము నెలకొనెనా, లేదా యను నంశమును ఇంతవఱకు చరిత్రయే రుజువుచేయలేదు. అయినను కావ్యకళాదృష్టితో అది యట్లైయుండునని నే నూహించితిని. విషాద ఖండములోని "కుమారిలభట్టు బౌద్ధులనోడించెనన్న గాథ" క్రమక్రమముగా బౌద్ధముపొందిన యధోగతికి కారణభూతమై యుండునని యుద్దేశించితిని.

ఇట్లు ప్రాచీనాంధ్ర రాజ్యవైభవమునకును, అమరావతీ శిల్పకళాలక్ష్మికిని దర్పణముగా నుండునట్లీ కృతి రచితమైనది. అమరావతీ చరిత్ర పరిచయమునకై భారతిలోని వ్యాసముగూడ "పురావలోకనము"గా నిందు చేర్పబడినది.

గ్రంథకర్త

19—1—1950

ఈ గ్రంథ ముద్రణమునకు రు. 600/- విరాళమిచ్చిన వదాన్యశ్రేష్ఠులు జగిత్యాల వాస్తవ్యులు

బ్రహ్మశ్రీ తుమ్మనపల్లి లింగయ్య - పురుషోత్తము సోదరులు



శ్రీ లింగయ్యగారు



శ్రీ పురుషోత్తముగారు

హనుమయార్య దేశికాగ్రణి శిష్యులై
ధర్మ మోక్షపథము తప్పకుండ
జాతి సేవసల్పు సజ్జనుల్ తుమ్మన
పల్లి సోదరులకు భద్ర మగుత !

రామ లక్ష్మణులుగ రంజిల్లు లింగయ్య
పూరుషోత్తములను భువనశిల్పి
ఆయురాది శుభము లవ్వారిగ నొసంగి
యేలుగాత మెల్లవేళలందు !

కృతినేత

శ్రీ సాగర్వాలాన్వయ
భాసుర రస భావ బహుళ భాషాకావ్యా
భ్యాసు రమేశుం డేలుత
కేసరిసింగు న్నితాంత కీర్తి శ్రీలన్!

అతఁ డొక సాహితీ రసికుఁ డన్న యథార్థము విన్నదాది, స్నే
హితునిఁగఁ జేసికోఁ దలఁపు హెచ్చె: నొక ప్డవధానవేది మత్
ప్రతిభ, కవిత్వ నైపుణము పాండితి గన్గొని ముగ్ధుఁ డయ్యె నా
చతురుఁడు; నాఁటినుండి సడిసన్న నిగారపు చెల్మి నూల్కొనెన్.

ఉత్తమ క్షత్ర వంశోద్భూతి నెలకొన్న
పరిపాల నోచిత ప్రాభవంబు
జనకుండు తత్త్వవిజ్ఞాని రుస్తుంసింగు
పిననాఁటి నుండి నేర్పిన నయంబు
ఆదర్శమాత విఖ్యాత లక్ష్మీబాయి
వెన్నతోఁ బెట్టిన వినయ శీల
మాబాల్యముగ కళాభ్యాస యోగంబులో
ప్రబలిన సాహితీ రస పిపాస

తన పురా సుకృతోదారతా విభూతి
కనుపమామూల్య భూషలై యందగింప
నతిశయిల్లు నిజాన్వవాయ ప్రసిద్ధి
చెలువములు చిమ్మ కేసరిసింహుఁ డవని.

మాటలయందు శౌర్య మణుమాత్రము చూపకయున్న, చేతలం
దోటమి యన్న దీ యనఘు నుత్తమ జీవితమందు లేదు; మో
మోటము దక్కి సత్య మెటులున్న నటుల్ వచియింప నేర్చు; నీ
మాటలు వేయునేటి కనమానుఁ డుదాత్తగుణ ప్రవర్తనన్.

నవనీతోపమ మైన మానస, మనన్యప్రాప్య గాంభీర్య వై
భవ, మత్యద్భుత కార్యదీక్ష, కరుణాపారీణ భావంబు, సత్
కవి విద్వజ్జనతానురక్తి, మహితౌదార్యాది సంపత్తి ప్రాగ్
భవ పుణ్యంబున సంక్రమించినవి విద్వల్లోక భాగ్యంబుగన్.

న్యాయాన్యాయ విచార దక్షమగు ప్రజ్ఞానైపుణిం దీర్పులన్
జేయ న్నేర్చిన పుణ్యమూర్తియగు “మేజిస్ట్రీ”టితండను నే
న్యాయజ్ఞుం డురు కీర్తి వల్లరుల నాంధ్రారామము న్నించెనో
మా యీ కేసరిసింగు సూరిజన సమ్మాన్యుండు వర్ధిల్లెడున్.

అన్నపూర్ణాంబ సాధ్వి విద్యా వివేక
వినయ సౌశీల్య శాలిని తనకుఁ గూర్చు
ధర్మచారిణి పతిదేవతా వ్రతంబు
నెఱపఁ జెలువొందు నీ కావ్యనేత సతము

ఆ లోనైన యెడందలోఁ దొఱకు సౌహార్దంపు సొంపా ముఖ
శ్రీ లో లాస్యము చేయు చిన్ని నగ వా దృగ్వీథిలోఁ దోచు ల
క్ష్మీ లాలిత్య ముదాత్త గౌరవము సూచింపంగ సాహిత్య సే
వా లబ్ధిన్ బరిపూర్ణుఁడౌ ననుచు సంభావింతు నీ పుణ్యునిన్.

ఏజన్మంబున సత్కవిత్వమున బ్రాహ్మీపూజ గావించెనో,
యీజన్మంబున క్రమ కావ్య లలనా హేవాకము ల్మెచ్చ ధీ
రాజద్వైభవ మబ్బె; నీదృశ కళా రామా మనోహారికిన్
రాజన్యాగ్రణి కస్మదీయ కృతి కన్యారత్న మర్పించితిన్.

మా మధురకావ్య నేత క
సామాన్య యశో విశేష సహితునకు గుణ
శ్రీ మహితున కిష్టార్థము
లేమఱక యొసంగుఁ గాత మీశ్వరుఁడు దయన్.

—o—

జే జే లు

తెలుఁగురాజుల పతాకలనీడలో జనుల్
సుఖనిద్ర గన్న రోజులు దలంచి
తెలుఁగుశిల్పుల కళావిలసనమ్ములకు ది
గ్దేశముల్ కై సాచు దినము లరసి
తెలుఁగుసంస్కృతి కెడందలు పల్లవింప దీ
వులు గడించిన నేరుపుల నెఱింగి
తెలుఁగుయోగుల యుపదేశము ల్వాని ఖండ
ఖండము ల్తరియించు గాథ లెన్ని

తెలుఁగు టిల్లాంధ్ర మే లైన చెలువములకు
జగము కై వారమొనరించు చరిత దడవి
తెలుఁగుల గురుత్వమహిమ బుద్ధిం దలంచి
తెలుఁగు తల్లికి జేజేలు సలుప వోయి!

ఆ ము ఖ ము

మన యమరావతీ మధుర మంజుల గాథలు ద్రవ్వి శాతవా
హన జనపాలు రేలిన పురాంధ్రము నారసి బౌద్ధభూతి నిం
డిన యలనాఁటి తెల్గుమహనీయత కాత్మ గరంగి పాడెదన్
దెనుఁగుల సచ్చరిత్రము లతిప్రతిభల్ బహుధావ్యథావహల్.

మతి యుప్పొంగి తరంగితంబగును సుమ్మా నాఁటి బౌద్ధాంధ్ర వి
స్తృత కల్యాణకథానికల్ విజయలక్ష్మీ వీరగాథ ల్వినన్;
శతధా గుండియ వ్రీలు ధాన్యకటకైశ్వర్యమ్ము వమ్మైన యా
కత లాలించిన జాతికేనియును దుఃఖమ్మేచి ముంచెత్తఁగన్.

కనులకుఁ గట్ట ధాన్యకటక ప్రథితాద్భుత శిల్పదృశ్యముల్
మనన మొనర్చి తత్కథలు మానసవీథినిఁ దాండవింపఁగాఁ
గని తదుదంతమెల్ల నవ క్రమగుణోజ్జ్వల కావ్యశైలిఁ జి
త్రణ మొనరించి యాంధ్రజనతా హృదయాలకుఁ గాన్కవెట్టెదన్.

ఈ స్వాతంత్ర్య నవోదయారుణరుచుల్ హేరాళమై పర్వ ప్రా
ప్త స్వారాజ్య శతాంగ చోదనకళా ప్రాగల్భ్య మర్థించి, నూ
త్నస్వాదిష్ఠ మనోజ్ఞ కావ్యరస తృప్తస్వాంతులై నేఁటి యాం
ధ్రస్వాము ల్గడియింత్రు గావుత నిజౌన్నత్య ప్రభావంబులన్.

రావోయీ! మహితాంధ్రసంస్కృతికథా
రమ్యాంకముల్ చిత్రమం
దేవో యూహల మేలుకొల్పి కవితా
హిందోళముం బాడ నూ
త్నావేశంబు ఘటించుచున్నయవి; పూ
ర్వాంధ్రప్రభావంబు చే
తో వీథి న్నటియింపఁ బాడుచు సము
ద్యోగింత మీ వేళలన్!

అమరావతి

ఉపదేశము

—o—

ఏ విశిష్ట ముహూర్తమం దిచట బౌద్ధ
చైత్యమున కంకురార్పణ సలిపినారొ,
మూఁడుపూ లాఱుకాయలై ముమ్మరించె
శిల్పమును ధర్మమును జేయి చేయి గలిపి.

ఎం దహింసాధర్మ మినుమడించుట జన్న
ములు జాతరలు రూపములు దొఱంగె
ఎందు జాతివిభేద మిసుమంత పొడసూప
కావహిల్లును మానవాళి సమత
ఎం దింద్రియములు యమింపంగఁబడి మహా
నిర్వాణపథము రాణించు ప్రజకు
ఎందు సర్వజ్ఞ మునీశ్వర బోధ సు
ధాసార మెదపక తన్పు జనుల

అట్టి బౌద్ధమతమ్ము సర్వావనీ త
లాన వ్యాప్తమ్ము సేయఁగాఁ బూనె నౌర !
మగధ భువనాధిపతి విశ్వమాన్యుఁడౌ న
శోక నరపాలుఁ డపగతశోకుఁ డగుచు.

ఇచట నశోకుని పనుపునఁ
బ్రచురింపఁగ బౌద్ధధర్మ పద్ధతులు ప్రజా
నిచయమ్ములోన నాగమ
విచక్షణుం డొక్క బౌద్ధభిక్షువు వచ్చెన్.

ఆ మహాదేవ భిక్షుకు నంత మునికి
విహరణస్థానమైన యివ్వీటఁ దెల్గు
ప్రాజ్య సామ్రాజ్యరమ క్రొత్తవలపు లీనె
శాతవాహన రాజ భుజమ్ము లెక్కి.

విహరించినది తెల్గువీరుల బావుటా
ధర్మమ్ముతో దిశాంతములయందు,
దిద్ది తీర్చినది దిగ్దేశమ్ములను నాంధ్ర
సంస్కృతి నూత్నవాసనలు చిమ్మి,
ఆవరించినది భూమ్యాకాశములు నిండ
వైదికాంధ్రుల కళా ప్రాజ్ఞహాస్య,
ఆదరించినది దయార్ద్రచిత్తము యోగ్య
తామూల మగు నే మతంబు నైన,

శాంతి పై వార సర్వప్రజా సుఖమ్ము
వెలయఁజేసిన దలనాఁటి తెలుఁగుజాతి,
"తెలుఁగుమీఁదె" నటన్న మేల్పలుకు జగతి
నిండి చాటంగ మన పురాఖండ యశము.

ఆ తఱి శాతవాహన ధరాధిపుఁ డాగత బ్రౌదపర్మ ని
ర్ణేతకు భిక్షుకాగ్రణి కనింద్యచరిత్రున కంజలించి, ధ
ర్మాతతబుద్ధియై వినె నుదాత్తములౌ ఘన బౌద్ధధర్మముల్
చేతము మెత్తనై కరుణచే నిలువెల్లఁ గరంగి పోవఁగన్

"ఓ శాతవాహనాంధ్రా
ధీశా! వినుమన్న! యస్మ దీప్సితము జగత్
క్లేశాపహ మఖిల సుఖ
శ్రీశత వర్ధకము బుద్ధ సిద్ధాంతమ్మున్.

భయ విషాద సందేహ దుర్భ్రమల గముల
శోకమోహము లెటఁ బరిశోష మంది
పొందు లోకము సుస్థిరానంద శాంతు
లా తథాగతు మతరీతు లస దటోయి!

అగపడని స్వర్గసుఖముల కాస చేసి
జన్నములయందుఁ బశువులఁ జంపునట్టి
పాపకృత్యము లన్ని రూపడెఁ గదన్న
బుద్ధదేవుని మహనీయ బోధకతన.

బుద్ధివిభవమ్ము మట్టిలోఁ బూడ్చి పెట్టి
గుణములను గర్మలను లెక్కఁగొనక జన్మ
చేత కులభేదములు సృష్టిచేయు కృతక
జాతినిర్ణేతలకుఁ బరాభూతి గలిగె

మానవుఁడు మానవుని రక్తమాంసములను
పీల్చి తిని త్రేఁచి యాత్మతృప్తిని గడించు
ఘోర మారణ శక్తులు కూలి పోవె
ఆ యహింసా జగద్గురుఁ డవతరిల్ల !

చీమ మొదలుగఁగల సర్వ జీవకోటి
కడుపులో నీరు కదల కక్కటిక మలర
బ్రతుకుమండవె యా ధర్మరాజుతపము
కారణము గాఁగ మర్త్యలోకమ్మునందు ?

వైదిక మతంబులో నభివర్ణితంబు
లౌ దశావతారమ్ములయందు బుద్ధ
దేవుఁ డొక్కరుఁ డా జగద్ధ్యేయమూర్తి
మత మెటు లనీశ్వరమ్మను మాట చెల్లు ?

దేశ కాల పాత్రంబుల తెరువు లరసి
ధర్మమును నిర్వచింత్రవతారమూర్తు
లా రహస్యం బెఱుంగని యట్టి జడులు
తగవు లాడుదు రేదో స్వార్థమ్ము కొఱకు.

ఈశ్వర ప్రోక్త మతమె యనీశ్వర మయి
పోవఁగా నెవ్వఁ డీ మర్త్యభువనమునకు
శాంతిదీపిక వెల్గించి జాడఁ జూపు ?
సుంత యోచింపుకొనుము నీ స్వాంతమందు.

ఏది యెటులైనఁ బరుల హింసింపకుండ
ఉపకృతి యొనర్చి మోక్షము నొందఁగోరు
సత్య సముపేతమౌ నహింసామతంబు
దొడ్డదో చెడ్డదో చూడు మద్దు లేదు.

కలదొక బౌద్ధగాథ వినఁగాఁ దగు - మున్నొక కాపుకన్య యా వుల నొకబీట మేపుకొనఁ బోయి యొకానొక ముద్దుపెయ్యమైఁ గలిగిన పుండుమాంసమును గాకులు చీల్చి భుజింపఁ గాంచి లో నలమటఁ జెంది పేర్చిన దయారసమట్లు కరంగిపోవుచున్.

భూతహితబుద్ధి లోపల ముమ్మరింపఁ
జిట్టి యాఁబెయ్యకును గట్టు కట్టి కాకి
మూఁకలను జోఁపి యిటు తనబుద్ధిఁదలఁచెఁ
జిత్తమపకార మొనరించి సిగ్గు పడఁగ.

ఈ పడ్డ మేలుగనె నా
వ్యాపారముకల్మిఁ గాని వాయసములు దా
మాపోవఁ దినెడి మాంసము
పాప మనక తీసితిం గృపా విరహితనై.

అకటా! దానము ధర్మముం దయయు తీవ్రాయాస సేవ్యమ్ము లూ
రక సాధింపఁగఁ జాలునా నరుఁడు స్వార్థత్యాగి గాకుండ! మా
మక మాంసం బిడియైనఁ గాకముల సమ్మానించి పాపంబు నం
దక పుణ్యంబునఁ బోదుఁగాకని ఘనత్యాగంబు ప్రేరేపఁగన్.

చేతికొడవలిచే నొండు చేయి చీల్చి
గాయ మొనరించి మాంసంబు కాకములకుఁ
దిండిగాఁ బెట్టె కారుణ్యదీక్ష యడరఁ
గాపుఁ జిన్నారిపొన్నారి కలువ కంటి.

ప్రాఁతపడ్డ పురాణాలు పలుకుచున్న
వెప్పుడో చన్న శిబిరాజు నిద్ధ చరిత!
కలియుగంబున నొక పేద కాపుకన్నె
మేనికండలు కాకి కామెతలు చేసె!

ఈ లోకాద్భుతవృత్త మారసి జినుం డెంతేని నుప్పొంగి తా
నాలోకించినదౌ దయావ్రతము ధన్యంబయ్యె నం చా కృపా
శీల స్మేరవచస్సులం దనిపి యాశీస్సిచ్చె రాజేంద్ర! వే
యేలా పల్కులు, బౌద్ధగాథలు శిలాహృద్వీథి నార్ద్రింపవే!

మునుపు కళింగయుద్ధమున ముమ్మరమై ప్రవహించు రక్తవా
హినులను, ఘోరహత్యలను, మృత్యు మహోగ్ర వికారనృత్యముఁ
గ్గని తన గుండె వ్రీలి వికలత్వము సెందఁగ బుద్ధదేవు బో
ధనల దయావ్రతమ్మున నుదారుఁ డశోకుఁడు దీక్ష పూనఁడే!

ఎంచఁగ రాజసింహులు మఱెందఱొ వైదికధర్మవేత్త లిం
కెంచఁగ శిల్పివర్యులును నెందఱొ బౌద్ధవిపక్షులు న్మహా
నంద మెలర్ప బుద్ధు కరుణాకరయోగమునందు దీక్షలం
బొంది తరింపలే దఖిల భూతహితవ్రత పూతబుద్ధులై!

దుఃఖభూయిష్ఠమౌ జగత్తున నితాంత
శాంతి సమతాధికానంద సమితి నింప
బౌద్ధధర్మము దక్క భూపాల! నేఁడు
శక్తములు గావు పరమత శతము లెవ్వి.

మం జ రి

పరుఁడు నావాఁడన్న భావంబు లేక
అందఱు భ్రాతలై యేకమత్యమునఁ
జరియింతు రే మత సామ్రాజ్యమందు;

గణికలు సైతమ మగ్గలమగు శక్తి
సామర్థ్యములు కల్మిఁ జతురలై మనుచుఁ
గ్రమధర్మములను సంఘమును సేవింతురి;
చదువుసంధ్యలయందు జనులందఱికిని
నమరియుండును సమానావకాశములు!

ధర్మసూత్రములు పొత్తముల లోపలనో
వా విచ్చి చేయు నుపన్యాసములనో
వెలయుట గాక జీవిత రంగమందుఁ
బ్రత్యంశమునయందుఁ బరిఢవిల్లెడునో;

శాక్యసింహుని పుణ్యాస్థి శకల మునిచి
కట్టవలె విశ్వమోహనాకార దర్శ
నీయమౌ స్తూపమొం డవనీతలేశ,
అనుమతింపఁగవయ్య ! కల్యాణకాంక్ష.

క్షితి విశ్వకర్మసృష్టికిఁ
బ్రతిసృష్టి యొనర్పఁజాలు ప్రజ్ఞానిధులౌ
కృతిపారగులౌ శిల్పుల
వితతులు గలరంట యంధ్రవిషయమునందున్.

ఇపుడు మీ శిల్పయోగుల తపము పండి
కళల రూపొందఁగా బౌద్ధగాథ లన్ని
దివ్యసౌందర్య మవనిపై దిద్ది తీర్చి
చేయవలె బుద్ధునికి శిల్పపూజ,

♦ ♦ ♦

ఆ యతిలోకాధీశ్వరు
నీ యుపదేశంబు నచ్చి యేలిక ప్రీతుం
డై యనుమతిఁ జేఁ బ్రిజగ
న్గేయ స్తూపము రచించి కీర్తి మించన్.

♦ ♦ ♦

అది బృహద్ధ్వని-'పెందోట' యందు రాంధ్రు
లసమ శిల్పేశ్వరులకు విహార సీమ;
ఆ మహాసూత్రధారులే యవని నెల్ల
మహిత శిల్పోపవనముగా మార్చి రంట !

ఆ "పెంజోటపురాధిపాలకుల" శిల్పాచార్యులన్ వేద వి
ద్యా పాండిత్య గురుప్రభావులఁ గళాధౌరేయులం బిల్చి త
ద్భూపేంద్రుండు సమర్చలం దనిపి సొంపుం బెంపు వాటింపఁగా
స్తూపం బొక్కటి సృష్టి సేయుఁడనుచున్ సోత్కంఠుఁడర్థించుచున్.

ముమ్మరించిన వేడ్కఁ గర్పూరకలిత
క్రమ తాంబూల మిడి భక్తి గౌరవించి
మణులు జాంబూనదము బహుమాన మొసఁగె
ఆ త్త సర్వ కళామర్ముఁ డాంధ్ర రాజు.

అపరబ్రహ్మ లనంగఁ పేర్వడిన శిల్పాచార్యులన్ దెల్గు దే
శపు పల్లీనగరమ్ములం గలుగు విశ్వబ్రాహ్మణ శ్రేష్ఠులన్
విపరీతంబుగఁ దోడుచేసికొని యా పెంజోట శిల్పాన్వయుల్
స్థపతు ల్పూనిరి ధాన్యవాటిక మహాచైత్యమ్ము నిర్మింపఁగన్.

కలియుగంబున విశ్వకర్మనా బిరుదంబు
గని వాసి గాంచిన ఘనుఁ డొకండు
మాఱట త్వష్టనాఁ బేరు గడించిన
యతిలోక నిర్మాణ చతురుఁ డొకఁడు
శిల్పసహస్ర విశిష్ట ప్రతిభ కల్మి
మయుఁడని నుతిఁగన్న మాన్యుఁ డొకఁడు
బహుమత ధర్మ సంపదలు శిల్పింపఁగా
నపర మనుండైన స్థపతి యొకఁడు

శిల్పవేదము జీర్ణింపఁ జేసికొన్న
నిస్తుల ప్రతిభా మహనీయులైన
సూత్రకారులు కొంద ఱా స్తూప శిల్ప
ఖండములు చెక్క నడుములు గట్టి రపుడు.

శ్లో॥ సచ్చిదానందరూపాయ
జగదంకుర హేతవే
సదోదితాయ నిత్యాయ
నమ శ్శ్రీ విశ్వకర్మణే.

విశ్వశిల్పమునకు విభుఁడయ్యె నే దేవుఁ
డాది శిల్పి నా కళాధినేత
విశ్వకర్మ వేదవిధి నిట్లు ధ్యానించి
పూనుకొనిరి స్తూపమును రచింప.

స్తూప శ్రీ

—o—

మూఁడు వందల యేడు లమోఘ తపము
చేసి సృష్టించి రీ స్తూప శిల్ప కృతుల
సిద్ధహస్తులు మన తెల్గు శిల్పి వరులు
తమ కళాశక్తు లన్నియు ధారవోసి.

చైత్యక సంప్రదాయ మిట స్థాపితమైన కతమ్మున న్మహా
చైత్య మటంచు నీయది ప్రశస్తి వహించి మహాంధ్ర సాంఘిక
స్తుత్య పవిత్ర పీఠమయి సొంపెస లారిన దా ధరాధిపా
దిత్యుల పాలనంబున నతిప్రతిభా కృత శిల్పకావ్యమై.

అద్ది కారుణ్యమూర్తి బుద్ధాంఘ్రి దివ్య
పూజ కెత్తిన రత్న నీరాజనమ్ము;
అది జగచ్ఛాంతిదూత దివ్యావతారు
నర్చనము సేయు శిల్ప పుష్పాంజలి పుటి ;

ఈ చలువఱాల ఖండాల నెన్ని రసము
లూరినవి, ఎన్ని కథలు రూపొందినవి, మ
ఱెన్ని జగములు కళల సృష్టింపఁబడిన
వహహ ! యీ యాకృతీశ్వరు లంటుకతన.

ఏ యమృతక్షణమ్ముల సృజించిరొ శిల్పికులీను లీ జగ
ద్గేయములైన శిల్పములఁ దెల్గుకళాప్రతిభల్ చరిత్రలో
మాయని కీర్తి వెల్గినవి మంజుతరాంధ్ర విశిష్ట శైలికిన్
మా యమరావతీకళకు మంగళగీతము పాడె లోకముల్.

సృష్టించి రిట శాక్యసింహ స్వరూపంబు
కరుణారసము పొంగి కాల్వ గట్ట
కల్పించి రిట యక్ష కామినీమణులను
భువనసౌందర్యంబు ప్రోవు పడఁగ
శిల్పించి రిట బుద్ధ జీవిత చరితముల్
శీల సంస్కారముల్ చిగురు వెట్ట
చెక్కినా రిచట విచిత్ర జంతువులను
స్వాంత మువ్పొంగి హర్షమునఁ దేల
సృజన యొనరించి రిచట నచ్చెరువు గదుర
నాంధ్ర సంస్కృతి నంత మహత్తరముగ
తెలి మెఱుంగుల నెలఱాల ఫలకములను
భువనములు మెచ్చఁ దమ కళాద్భుత చరిత్ర.

నలువురు శిల్పిబ్రహ్మలు
నిలువెల్లం ధారవోసి నిర్మించిరఁటే
లలితమగు బుద్ధసభ నొక
కళా నిధానంబుగా నఖండిత శక్తిన్.

మన ముప్పొంగ నుపన్యసించెడు నహింసాధర్మసిద్ధాంతి బో
ధనముల్ వీనుల విందుగా వినుచుఁ జిత్రప్రక్రియం బొల్చు న
మ్మనుజవ్రాతపుఁ దన్మయత్వ మెటు నిర్మాణించెరా శిల్పి! యా
తని కెంగేలికిఁ జల్వఱాయి నవనీత ప్రాయమై పోయెనో!

"సూచీ శిల్పము" లందుఁ జెక్కిరి జనస్తుత్యంబులౌ నేన్గులన్
బ్రాచీనాంధ్ర జనాళి వైఖరులఁ దెల్పంజాలు మేల్మూర్తులన్
వాచాతీత మనోజ్ఞ పద్మముల శుంభద్దివ్య శిల్పైక వి
ద్యాచాతుర్యము ఖండఖండముల జోహార్లంది వెల్గొందగన్.

"ఊర్ధ్వపటము"ల యందు మహోజ్జ్వలముగ
నాట్య వేదము శిల్పించినారు చూవె!
బౌద్ధ జాతక కథల విస్పష్టముగను
నడిమి ఫలకమ్ములోఁ దీర్చినారు సుమ్మ.

చైత్యశిలా ఫలకంబుల
నత్యద్భుత శిల్పరేఖ హావణించి మహా
చైత్యములఁ దీర్చి పెట్టిరి
చైత్య ప్రతికృతులనంగఁ జాలెడు రీతిన్.

అదిగో! బుద్ధుని ధర్మచక్ర మొక స్తంభాగ్రంబునం జెక్కఁబ
డ్డది; లోకాద్భుత దివ్య శిల్పకళ నాట్యంబాడు నాకంబమం;
దదియే చాలు పురాంధ్రశిల్పి విజయాహంకార గాథావళుల్
గొద లేకుండ వచింపఁ దద్యశము దిగ్వ్యూహంబుల న్నింపగన్.

అందుఁ జెక్కిన గుజ్జాలయందుఁ దెల్గు
జోడు వొయ్యారముగను గూర్చుండి యాంధ్ర
నాగరికతను నీ నేల నాల్గు చెఱగు
లంపు నింపంగఁ బోవుచున్నట్లు దోఁచు.

అపరబుద్ధుఁ డనంగఁ బే రంది నట్టి
యార్యనాగార్జునుండు శిల్పాగ్రయాయి
కల్పనము చేసె నంట ప్రాకారరేఖ
భువన సౌందర్య మిట నచ్చు పోసినట్లు !

వేద వేదాంత శాస్త్రాది విధుల నాత్మ
స్వత్వములఁ జేసికొన్న శిల్పప్రభుండు
తన కళాక్షేత్రమందు నధ్యాత్మ సత్య
మర్మముల నెంత మెలఁకువన్ మలచినాఁడు !

'ఆయకకంబము' ల్మెఱపునట్టి తెలుంగు తెలుంగుశిల్పమం
కే యుగపడ్డ కీ తెలుఁగుదేశపు శిల్పి స్వ సంప్రదాయమున్
దాయక సృష్టి హేతువులఁ బంచవిధాదిమ శక్తులన్ జగద్
ధ్యేయులఁ బంచమూర్తులను దీరిచి చూపెను వీని రూపునన్.

ఆది మై కైక తత్త్వమునం దభిన్న
ములుగ నెలకొని భువన లీలల పెలార్చు
పంచ శక్తుల నే మత పక్షమందు
నన్వయింపంగఁ జాల రధ్యాత్మవిదులు!

ధర్మచక్ర ప్రవర్తనా ద్యంబులైన
పంచ కల్యాణములను సూచించు వాంఛ
సైత మున్నది యా నాఁటి స్థపతి మణికి
నార్యక స్తంభ నిర్మాణమందుఁ జూడ

బుద్ధుఁడును, ధర్మమును, సంఘమును ననంగఁ
నలరెడు త్రిరత్నములకుఁ దా నా త్రిశూల
చిహ్నమును జెక్కి యల పరశివుని బుద్ధు
నొక్క సూత్రములో గ్రుచ్చె నోయి శిల్పి.

బుద్ధోదయమున కద్భుత చిహ్నములు గాఁగఁ
బద్మచిత్రమ్ములఁ బాదుకొల్పి
అద్వయవాది మహాభినిష్క్రమణంబు
తలఁపించు వారువమ్ములను మలచి
మారజయంబు నుదార బుద్ధత్వాప్తి
స్మరియింప బోధివృక్షములు చెక్కి
సౌగత ధర్మ ప్రచారంబు సూచించు
ధర్మచక్రముల విస్తరము తీర్చి

ఆ మహాపరినిర్వాణ మాత్మ వెలయ
స్తూపరూప శతమ్ములఁ దొలిచి పెట్టి
శాక్యసింహుని జీవిత సార మెల్ల
వ్రాసినా రీ శిలామయ గ్రంథమందు.

కామకల్పిత సంసారకంధి దాఁటి
జీవితమ్మన బుద్ధిత్వసిద్ధిఁ గాంచు
గెలుపునకు సూచకంబుగా మలచినారు
చైత్యమున రమ్యతర సింహ సముదయంబు.

హైందవ శిల్పికిన్ సహజమౌ రసభావ మనోజ్ఞ చిత్రణం
బిందలి మూర్తులన్నిట సమృద్ధి వహించెను; బాహ్యాకృతుల్
చిందిన వందచందము లశేష జగంబులు నాంధ్రశిల్పి సం
క్రందను చాతురీమహిమ గాంచి యొనర్ప చిరప్రశంసలన్.

ఇవిగో ! బుద్ధుని దివ్యపాదములు గంభీ శూలచక్రాది ల
క్ష్మవిలాసోజ్జ్వలముల్ దురంత భవదుఃఖ ధ్వంసకంబుల్ సదా
భువనారాధ్యము లెట్లు శిల్పి ప్రతిభాపూర్వక్రియా సృష్టి వై
భవ చాతుర్యము రూప మెత్తినటులే భావించి కల్పించెనో!

గౌతమమునీంద్రు శ్రీపాద కమలముద్ర
లెచట హత్తిన నట జగ దీడ్యము లగు
స్వర్గములు సృష్టి కాలేదె జనతయందు
నిత్య నిర్వాణ పథము రాణింప లేదె!

ఈ మహనీయపాదముల కెందలు మ్రొక్కులు పెట్టి జన్మదో
షామయ శూన్యులైరొ, మహిమాఢ్యము ఖూతచయావ్రతమ్మనే
భూములఁ బండఁజేసి యివి పుణ్యయుగమ్ముల సృష్టిచేసెనో
యేమరకుండ వీని మది నెంచి ఘటింపుఁ డనశ్వరాంజలుల్.

దివ్యతమ శిల్పముల నిట్లు తీర్చి దిద్ది
ఆత్మనామంబు చెక్కకోనట్టి శిల్పు
లెంతవైరాగ్యపరులొ! మఱెంత కీర్తి
కామనాదూరులో! శివంకర ధిషణులొ!

ఆర్యకస్తంభాల యందచందములలో
లతలు పూవులు సింహతతులు చూచి
అండచిత్రముల దివ్యాకారములలోని
మూర్తుల యింపు సొంపులకు మెచ్చి
ప్రాకారరేఖపై లోకాద్భుతపు శిల్ప
చాతుర్యమున కాత్మ సంతసించి
ఉష్ణీష శిల్పాల నొప్పు సముజ్జ్వల
సౌందర్యమునకు నాశ్చర్య మంది
ఆయధిష్ఠాన చిత్రములందు నూర్ధ్వ
పటములందలి దివ్యశిల్పముల కుబ్బి
త్రిజగముల నేలఁజాలు మా తెలఁగుశిల్పి
మహిత నిర్మాణ కళకు నమస్కరింతు.

నా కవిత చాలదోయి, సుందరము లయిన
నీ రచించిన శిల్ప ఖండికల నెన్న;
భావనావీథిఁ దలఁపులు ప్రాఁకులాడి
మాయమై పోవుఁ గడకే సమాధియందొ!

శాశ్వత కళాధనంబు దేశమున కొసఁగి
అనుపమత్యాగ మొనరించి యరిగినట్టి
కీర్తి సన్న్యాసివగు నీదు కృతులు కతలు
మానవాదర్శములు విశ్వమాన్యములును.

ధనకటక దివ్యశిల్ప సౌందర్యలక్ష్మి
ముగ్ధ మొనరించుటను జగమ్ముల మనమ్ము
అన్యదేశీయు లాయమ్మ కంజలించి
సంప్రతిష్ఠించుకొన్నారు స్వస్థలముల!

వైభవము

—౦—

బుద్ధదేవుని శ్రీపాదములకు నెరగి
ఆర్యక స్తంభ శోభల నభినుతించి
ధర్మచక్ర ప్రసిద్ధ సౌందర్య మెంచి
వర్ణన మొనర్తు మన పురావైభవమ్ము.

ఈ మహాదుర్గంబు నెటుల నిర్మించిరో
శాత్రవానీక దుస్సాధముగను
ఈ నృప ప్రాసాద మెటు సృష్టి చేసిరో
శిల్పదేవత దృఢాసీన గాఁగ
ఈ సౌధ విధముల నెట్లు కల్పించిరో
వాస్తు సంపద కాటపట్లు గాఁగ
ఈ వీథివిన్యాస మెట్లు లూహించిరో
పురలక్ష్మి క్రొత్త సొంపులు వహింప

ఈ మనోజ్ఞాపణంబుల నెట్లు తీర్చి
కట్టిరో క్రొత్తచెలువము లుట్టిపడఁగ
ఈ పురోద్యానవాటుల నెట్లు తీర్పఁ
గల్గినారలో వింత సింగార మొలుక.

గోపుర ద్వార తోరణ కుడ్యతతుల
శిల్ప విన్యాస రీతు లచ్చెరువు గొల్పి
ధాన్యకటక పురీంద్ర సౌందర్య లక్ష్మి
విభ్రమ విలాసములఁ జెప్పు వేవిధములఁ

అట బౌద్ధసన్న్యాసు లాదరించు ననాథ
బాలు రుండిన శరణాలయములు
అట హోమకుండాల కాహుతి గాఁబోవు
పశువుల రక్షించు భవన సమితి
అటఁ త్రిరత్నముల సంధ్యావేళ బోధించు
కారుణ్య నిధుల దీక్షాగృహములు
అట నహింసాధర్మ మాద్యంత మెఱిఁగింప
వెలయు నుపన్యాస వేదికలును
ఆపట నష్టాంగయోగంబు నభ్యసింపఁ
దీర్చి కట్టిన మహనీయ దివ్యశాల
అరసి యాంధ్రుల భోగభాగ్యముల కెడఁద
ముదముపడ నెంతొ పొంగిపోయెదము మేము.

ఒక తెలుఁగుంజగమ్మున కటోయి, దిశాఖిల దేశ దేశముల్
ప్రకటముగాఁగ గర్వపడు భంగిఁ జెలంగిన ధాన్యవాటి రాట్-
ఛకము సమస్త శాంతి సుఖ సంపదల న్వెలయించి నూత్నజీ
విక వెలిగింపలేదె; నవ విశ్వము సృష్టి యొనర్పదే ధరన్।

తన బౌద్ధగురుని మతవ్రత దీక్షగా
సింహళంబున స్తూపచిహ్న ముంచి
తన సర్వశిల్ప విద్యానిదర్శనముగా
"దాపంగు" విశ్వవిద్యాలయ మిడి
తన యహింసకు మేలి తార్కాణగాఁ బ్రాణి
వితతికిఁ గారుణ్య భిక్ష పెట్టి
తన కళారాధన కెనలేని ఫలముగా
జగమెన్ను స్తూపరాజంబు గట్టి
తనదు బౌద్ధధర్మ తత్పరతకును దృ
ష్టాంతములుగ మేల్విహారములను
బెక్కు వెలయఁజేసి పేరుగన్న దమరా
వతి మహోజ్జ్వలాంధ్ర పత్తనంబు ,

ఆ పూట కింట బియ్యము లేని నిరుపేద,
కవులపైఁ గురిసె బంగారువాన
అతిలోక సృజనా కళా రాధకుల చేయి
సృష్టించె శిల్ప విశిష్ట జగము
పరులగుండెలు తీయు బంగ్లైన తెల్గు జో
దుల బాకులు దిగంతముల వెలింగె
కులభేదములను ముక్కలుగాఁగఁ జీలిన
మానవు లేకసమాజ మైరి

అమరావతి

ఆఢ్యు లైన మనుజు లాదిగా వీథిలోఁ
బేడ క్రోవు చేయు పిల్లదాఁక
చదువు నీతి గలిగి చదురులై వెల్గిరా
బౌద్ధ భూమిపతుల పాలనమున.

పొట్టకుఁ గూడు కట్టుటకుఁ బట్టము గానని పేదవారు లే
నట్టి జగమ్ము నెట్లు సుగతాంధ్రులు సృష్టి యొనర్చినారలో!
యెట్టుల నీ చరాచరము లెల్ల సుఖంపడ బద్ధదీక్షులై
కట్టిరొ శాంతితోరణ లఖండ పరోపకృతి ప్రవీణులై!

ఇట శిలాశిల్పమే కాక యెల్ల కళలు
నాంధ్ర నాగరికత వెల్గు లతిశయింప
వెల్లివిరిసిన వా పూర్వ వేళలందు
నాంధ్ర శిల్పుల చాకచక్యంబుకతన.

పంచవిధ శిల్పముల దేశభాగ్యమునకు
సాధనముగా నొనర్చి యైశ్వర్య లక్ష్మి
సంతరించుట కా నాఁటి స్థపతి వరులు
వెదక కున్నట్టి దొక చిన్న వృత్తి లేదు.

ఆ కృష్ణాతటినీ తరంగముల నొయ్యారంబుగా నాడు మా
నౌకాశ్రేణులు తెల్గు వర్తకుల విన్నాణంబు సూచించెడిన్;
నైకాశ్చర్య మనోజ్ఞ వస్తుయుత నానా కర్మశాలావళుల్
మా కర్మారుల హస్తనైపుణిని దార్కాణించు వే రీతులన్.

అపుడు లే రాంధ్రత్వ మగ్గిఁ గాల్చి విదేశ
రీతుల మెచ్చి వరించువార
లపుడు లే రాత్మార్థమయి లోకమును బలి
గొనునట్టి నిష్ఠుర క్రూరకర్మ
లపుడు లే రాత్మధర్మాపేతులై యవి
నీతితెర్వులఁ బయనించువార
లపుడు లే రాంధ్ర దేశారాధనము వీడి
పరుల పంచలు సేరి బ్రతుకువార
లపుడు లే రెన్నిచూచిన నంధ్రమందు
నాంధ్రజాతీయతా దూరులైన మనుజు
లప్పు డాంధ్రత్వ మగ్గలమై జగమ్ము
నేలినది సుమ్ము తనధాటి కెదురులేక !

లోక కల్యాణ ఘటనా విలోలబుద్ధి
బుద్ధదేవునివలె త్యాగమును బొనర్చి
జీవితము సార్థకంబుగాఁ జేసికొన్న
మనుజు లగ్గల మా నాఁటి తెనుఁగుజగతి.

విశ్వహితంబుపొంటె నతివేల సుఖంబులు భోగభాగ్యముల్
నశ్వర జీవితంబులు తృణంబుగ త్యాగమొనర్చి సేవయే
శాశ్వత శాంతిమార్గమని సంతత భూతహితానుసారులై
యాశ్వరతృప్తికై బ్రతికి యేఁగిరి తెల్గులు బౌద్ధభూమిపై.

శాతవాహన ధరానేత శ్రీముఖుఁ డాత
డందు సామంతోపహారములను,
హాలుని గొలుచు గుణాఢ్యుఁడాతఁడు బృహ
త్కథ సృష్టిసేయు ప్రాగ్గాథ లేర్చి,
భావ వివేక తాపస గురుండాతఁ డ
ద్భుత వజ్రధారణీ స్తుతి యొనర్చు,
తాంత్రిక బౌద్ధ విద్యా పారగులు వారు
జపియింతు రే మంత్ర సముదయంబొ
అదె మహాయాన బౌద్ధశాఖానుయాయు
లచట చర్చింత్రు హీనయానార్య సమితిఁ
గలసి బుద్ధుని తొంటి విజ్ఞాన రీతు
లహహా! యివి యెంత చారుదృశ్యంబులోయి!

క్షత్రపాన్వయు నహపాన చక్రవర్తి
సైన్య సహితమ్ముగాఁ దున్మి శాతకర్ణి
ఆంధ్రసామ్రాజ్యమును దిక్కులంటఁ బెంచి
తెలుఁగు జెండాలు కడల నర్తింపఁ జేసె

ఈ తెలుగుంబొలాల ఫలియించిన సంస్కృతి సస్యసంపదల్
భూతల మెల్ల నిండినవి పో, మన భారత ధర్మ కేతన
స్ఫీతరుచుల్ ప్రజాహృదయ సీమల నాంధ్యము చిమ్మి శాంతి వి
ద్యోతిల నేల నేలిన మహోజ్జ్వల చిహ్నము లున్న వెన్నియో.

సింహళద్వీప ప్రసిద్ధ శిల్పంబులో
　　　　నమరావతీ రీతి హత్తుకొనియె
చీనా జపాను విజ్ఞాన కాంతులలోన
　　　　తెలుఁగు తళతళల్ తేజరిల్లె
జావా సుమిత్రాది దీవులలో మన
　　　　తోలు బొమ్మల వినోదాలు వెలఁగు
కాంబోడియా ప్రముఖమ్ముల హైందవ
　　　　మత సంస్కృతులు సువిస్తృతము లయ్యె
చెంగటగ నున్న దీవులఁ జెప్ప నేలఁ?
"అమెరికా" యందె మనశిల్ప మడుగు పెట్టె;
ఆసియా జ్యోతి వెల్గి లోకాద్భుతముగ
మర్త్యజగమున చీఁకటి మాంద్య మణఁచె.

దక్షిణాపథమునకుఁ బ్రధాన బౌద్ధ
పీఠ మీ యమరావతి విస్తరించె
నవని నెల్లెడ బౌద్ధ విహారములను
సమ్మతములగు శిల్ప విన్యాసముల.

అప్పుడు గణనీయముగ దేశమందు జరుగు
బౌద్ధ సంగీతులం దాంధ్ర పండితాళి
వాదధోరణి ప్రతివాది వాయి కట్టి
గెలుపుగొన్న చరిత్రలు కలవఁటన్నా!

సింహళద్వీపమున మున్ను సృష్టిచేయు
స్తూప సందర్భమునకు భిక్షు వ్రజంబు
నాల్గు లక్షల "పై చిల్కు" నడచినార
లాంధ్రదేశమునుండి నాఁ డబ్బురముగ.

తెలుఁగువారపు డా మహాదేవభిక్షు
నాధిపత్యముతో ననూరాధపురము
వాడవాడలఁ "గిటకిట లాడఁ" జూచి
పొరుగుదేశము లెంత మచ్చరము గొనెనొ!

అప్పుడు వీరి మూలమున నాంధ్రుల నాగరికత్వ సంపదల్
కుప్పలుగాఁగ సింహళములో దిగెనందురు; తెల్గుశిల్పపుం
జొప్పులె కానుపించు నట స్తూపమునందున బుద్ధమూర్తిలోఁ
జెప్పెడిదేమి తెల్గు పస చేరెనురా! చిఱు దీవులందునన్.

ఆప స్తంబ మహాతపస్వి నిగమ వ్యాఖ్యా ప్రశస్తోరు వి
ద్యాపాండిత్య మహాప్రగల్భు డిట సూత్రగ్రంథముల్ వ్రాసి తా
నాపాదించె ననంత కీర్తుల త్రిలింగైశ్వర్య సంధాత యై;
యా పుణ్యర్షి చరిత్ర మాంధ్రులకు సంధ్యామంత్రపూతమ్మగున్.

శా లి వా హ నుఁ డు

ఇచ్చట శాలివాహన కవీంద్రుఁడు ప్రాకృతభాషలో కవుల్
మెచ్చెడు తీయ తీయనగు మేలిమి గాథల నేడు నూర్లు వా
క్రుచ్చి సరస్వతీ రుచిర రూపము తీరిచి దిద్దె నంట; యా
సచ్చరితాగ్రగణ్యు నుతి సల్పరె యాంధ్రులు నేఁటి కేనియున్!

ఆంధ్రుల సేవగా రస మహత్తర మంజుల కావ్యగాథ లీ
యాంధ్ర నృపుండు ప్రాకృతము నందొదవఁ గూర్చి మనోజ్ఞభావ సీ
రంధ్ర నొనర్చి దాని, నతిరమ్య యశోనవ చంద్రకాంతిలో
నాంధ్రము ముంచియెత్తె నహహా! పులకింపఁగ మేను సోదరా!

జుమ్మని తేఁటులు మూఁగెనొ,
గమ్మని వాగ్దేవి గజ్జె కదలించెనొ, మా
కుమ్మరి దొరగా రిమ్మహి
కమ్మని గాథామధూళిఁ గార్చెదు వేళన్.

రెండు వేలేండ్ల నాఁడె మా తేఁడు మధుర
మధుర నవ సాహితీ రుచు ల్మల్లడింప
విశ్వమోహన గాథలు వెలయఁజేసె
నన్న కీరితి నీదెగా యాంధ్రపుత్ర !

నూఁగుమీసాల ప్రాయమందున తలంపు
లుజ్జ్వలములై గుబాళించు చున్న యపుడు
శాలివాహను నీ "సప్తశతి ని" నొడివె
నాంధ్రమునయందు శ్రీనాథుఁ డద్భుతముగ.

ఆ కవిసార్వభౌముఁడు రసాంచితశైలిఁ దెలుంగు చేసెఁగా
నా కృతిరత్న మాంధ్రుల మహాదురదృష్టము హేతువున నా
త్మాకృతి గోలుపోయినదియా! అది యుండెనె శాలివాహన
శ్రీకవి సచ్చరిత్రమును జెప్పెడి దేమొ రవంతయేనియున్!

శకము నిలఁబెట్టి మన యాంధ్రజాతి యశము
వసుధ నింపిన యొక చక్రవర్తి యతఁడు!
ఆతని మనసారఁ బూజించి యతనిమహిమఁ
గొలువఁ జాలని పటు కృతఘ్నులము మనము.

కుమ్మరివంగడమ్ము వెలుఁగుల్ వెలయింపఁగఁ బుట్టి, యాంధ్రరా
జ్యమ్మున కేలికై మధురసాహితి మన్నన సేయు విజ్ఞుఁడై
కమ్మని గాథ లల్లిన యఖండ కళారసమూర్తి కాంధ్ర దే
శమ్ము రచింపదే రస వశంవదమై రుచిరాక్ష రాంజలుల్!

నాగార్జునుఁడు

అతఁడు నాగార్జునాచార్యుఁ డతులశక్తి
సిద్ధులను గాంచి యోగవిశిష్టుఁ డగుచు
అక్కె నాగార్జునాభిఖ్య నలరు మేటి
గడ మహాయాన బౌద్ధ శాఖా ప్రణేత!

ఏ మహా తాపసోత్తంసుఁ డిరవు కొనుటఁ
గనెనొ "నాగార్జునునికొండ" యనెడు పేరు
శ్రీగిరీంద్ర, మతండు ప్రసిద్ధ శిల్ప
చాతురీ ధూర్వహుఁడు బౌద్ధ చక్రవర్తి.

బుద్ధ గుణశీలముల సత్యపూర్వ ఫణితి
మధురముగ వర్ణన మొనర్చి మాన్యుఁ డితఁ
డంపినాఁడు "సుహృల్లేఖ" యనెడు పేర
నాంధ్రరాజగు శాతవాహనుని కడకు.

ఆ లేఖాంశము లెంతపూజ్యములో నాఁడా యాంధ్రరాజేంద్రుఁడు
ద్వేలానందము సందడింపఁగఁ దదాదేశంబు పూదండఁగా
మౌళిం దాలిచి బౌద్ధ ధర్మముల సన్మానించి బంగారపుం
బూలం బూజలు చేసె చైత్య మనిదంపూర్వాభిరామంబుగన్.

అతని పవిత్ర సేవల కుదాహరణంబులు తెల్గుగడ్డపై
స్థితిఁ గనినట్టి చైత్యములు శిల్పవిచిత్రములుం గళాలయా
ద్భుత మహనీయసృష్టులు నపూర్వము లార్ష్యత దర్శనంబులున్
జతుర వినూత్న వైద్యవిధ చర్యలు జీవన సౌఖ్య హేతువుల్.

అతని నాగార్జునునికొండ యభ్యుదయము
నాదిశంకర గురుమూర్తి యణఁచి వైచె
వికృత బౌద్ధము ఖండించి వేసి వేద
ధర్మసంస్థాపనము సేయు తరుణమందు.

ఈ నాగార్జునభారతీయముని యే యే సత్కృతుల్ వ్రాసి వి
జ్ఞానంబున్ వెదచల్లె లోకమున నా సద్గ్రంథముల్ శ్రీహరీ!
యేనాఁడో చనె నగ్నిసాత్కృతముగా నివ్వేళ నవ్వాని నే
చైనాయందొ తిబెత్తునందొ కని హస్తంబందరే హైందవుల్.

బౌద్ధమత సంస్కృతికి భక్తి స్వాగతంబు
పలుకుటంజేసి ప్రాకృత వాఙ్మయంబు
హైందవోదగ్ర కోపానలార్చి బ్రమ్గి
స్వస్వరూపముతోడఁ గన్పడదు నేఁడు.

విశ్వవిద్యాలయము

అదిగో ! పూర్వాంధ్ర విశ్వవిద్యాలయమ్ము
శారదాదేవి రమ్య విహారశాల,
కళల కాణాచి, చదువులఁ గన్నతల్లి;
అరయు మొకపరి స్మృతినేత్ర మట్టె విప్పి.

ఈ కళాపరిషత్తు మున్నెన్ని యెన్ని
దేశముల కాత్మవిద్యోపదేష్ట యగుచుఁ
దెలుఁగు వెలుఁగులు దిక్కుల నిలిపినదియొ
అరసిరే యెన్నడైన మా యాంధ్రజనులు ?

ఇట గజ్జె గట్టి శారద
నటనము సల్పిన దఁటా దినంబులయందు
త్కటమయి శిల్పశ్రీ వి
స్ఫుటకీర్తులు దెసల క్రమముగఁ బ్రాఁకె నఁటే !

ఆ కరుణాతపస్వి హృదయమ్ము ద్రవించి జగద్విముక్తి ల
క్ష్మీకము లెట్టి శాస్త్రములు సృష్టము లైనవొ, వాని బోద్ధ వి
ద్యాకృతు లైనపండితు లహర్పతితేజు లుపన్యసించు నా
యా కమనీయ దృశ్యముల నాత్మ సుఖంపడఁ జూడు నెచ్చెలీ !

పదిమిదివేల శిష్యు లిట నెప్పుడుఁ బాయక శాస్త్రముల్ కళల్
మనన మొనర్తు రంటె ! మతిమంతులు గీష్పతులట్టి దేశికా
గ్రణులు శతాధికంబుగ నిరంతరచర్చలఁ బుచ్చువారఁటే !
ఘనులగు శిల్పులున్ గవులు క్రమకళార్చన సేయువారఁటే !

అదె విశ్వవిద్యాలయ ప్రవేశద్వార
మతిలోక శిల్పాల కాటపట్టు ।
ఇదె పట్టభద్రుల కెలమిమై యోగ్యతా
పత్రమ్ము లందించు భవ్య భవన ।
మదె శిష్యతతికి శాస్త్రార్థముల్ బోధించు
రక రకమ్ముల హర్మ్య రాజ రాజి ।
అవిగొ దేశాంతరాయాత విద్యార్థుల
వసతికా ఘనసౌధ వాటికలును।
అవె మహోత్కృష్ట శిల్పకళాలయంబు ।
లవ్వి కార్యాలయంబు, లియ్యది మనోజ్ఞ
ఘనతరాద్భుత పుస్తకాగార సమితి!
సర్వ వస్తు ప్రదర్శన శాల లివ్వి ।

అల 'టిబెట్టు'న నిర్మితమై తనర్చు
నట్టి "దాపంగు" విశ్వవిద్యాలయంబు
దీని నాదర్శముగఁ గొని తీర్చి రంచె
యాంధ్రుల గురుత్వమునకు చిహ్నంబు గాఁగ :

మఱల మా భారతీదేవి మధుర మధుర
మంజు నూపుర నిక్వాణ మహిమ వినమొ ।
ప్రాక్కళాయోగ విజయ గర్వము తెలుంగు
వీర సంతతి హృదయాల వెలయఁ గనమొ ।

బుద్ధ జయంతి

ప్రతివసంతపు వైశాఖ పర్వములను
బుద్ధుని జయంతులందు నబ్బురము గదుర
వాడవాడలు కళకళ లాడి పోవు
ధర్మదృశ్యమ్ము పొడగాంచు పాఠకుండ !

ఈ పవిత్ర దినంబుననే ప్రభుండు
'ధర్మచక్రము' నా మృగదావమందు
త్రిప్పినాఁడటె! యా పుణ్యదివస మెన్ని
పూజలకు నోచుకొనదు భూభువనమందు !

ధర్మచక్రంబు నద్వయద్రష్ట త్రిప్ప
ప్రజల భాగ్యమ్ము క్రొంగ్రొత్తబాటఁ దిరిగె,
జనతలో హెచ్చు తగ్గులు సమసిపోయె,
సంఘమున నేరికి నవజ్ఞ జరుగదయ్యె!

సదస దన్యమైన పదమును జేరంగ
దుఃఖదూరమైన త్రోవ నడువ
సర్వు లంద నిత్య నిర్వాణ సంసిద్ధి
*ధర్మచక్ర మొకటె తానకంబు!

ద్వీప ద్వీపాంతర గత
భూపాలుర ప్రజల బుద్ధ బోధసుధా పా
రాపాన తృప్తు లగుటకు
ఆపూర్ణిమ వెలయుచుండు నేఁటఁ దమిన్.

---

* బౌద్ధధర్మ మొకటె ప్రాతిపదిక.

వారు చీనాదేశ వాసులౌ భిక్షువుల్
పూజించుచున్నారు బుద్ధదేవు
వారలు సింహళప్రజలు వెల్గింతురు
దీప వితానముల్ స్తూపమందు
వారు త్రివిష్టపావాస విద్యార్థులు
పఠియింతు రట "ధమ్మపదము" భక్తి
వారు జావాద్వీపవాసులు త్రిపిటక
ధర్మ నిర్మల చర్చఁ దవిలినారు
వా రఖండులు సుమ్మాంధ్ర బౌద్ధగురులు
పన్యసింతురు ప్రబల విపక్ష పక్ష
ఖండనోదగ్ర చాతురీ గరిమ సుగత
వితత మతహిత రీతు లద్భుతము గదర :

బుద్ధుని జీవితాంశములు పూసలు గ్రుచ్చినరీతిఁ జెప్పు సం
విద్ధనమైన యా "లలితవిస్తర" కావ్యము నాంధ్రపండితుల్
బుద్ధమతాభిమానులకు బోధ యొనర్చెద రందుఁ గాంచు మా
వృద్ధులు బాలు రంగనలు విందు రట "స్నవధర్మ" పస్తుతుల్.

ఇదె కృష్ణానదిఁ గ్రుంకువెట్టి గుమురై యేతెంచు నీ భిక్షువుల్
చదువంజొచ్చిరి బౌద్ధవేదముల; నా చాయన్ పరివ్రాజికల్
సుదతీలోకముఁ గూర్చి బుద్ధుని మహాసూక్తార్థము ల్విప్పి చె
ప్పుదు రీ సుందరదృశ్యముల్ హృదయ మాపోవంగ భావింపుమా!

—o—

విషాదము

—o—

అది సుధన్వ నృపాలు సభాంగణంబు
బౌద్ధ వైదిక మతసత్య భంగు లరయ
నుభయ మతములవారు మహోద్ధురు లయి
వాదములు సేయఁ బూని రా ప్రభుని మ్రోల.

వైదిక ధర్మమార్గ మనవద్యముగా భువి నిల్పి కీర్తి సం
పాదన సేయఁ బుట్టిన కుమారిలభట్టుఁ డుదగ్ర వైఖరిన్
వాదమొనర్చె వైదికుల పక్షముగైకొని; బౌద్ధపండితుల్
మేదుర తర్కఘోరకులు మించిరి బ్రాహ్మణ పండితావళిన్.

ఇహా దినము లట్లు వాదోపవాదములను
జరిపినను సత్య మేదియో తెలియ కునికి
"ఆగమము లప్రమాణము లైనఁ జత్తు,
నవి ప్రమాణంబులేని మే హాసఁ జెంద"

అని యొక పర్వతాగ్రమునయందుననుండి కుమారిలుండు దూకిన, నణుమాత్ర మెగ్గతనికిఁ బొడసూపదు; సభ్యులెల్లరుఁ జనపతి గూడ మెచ్చి రది: జైనులుమాత్రము మంత్రసిద్ధియో మణుల ప్రభావ మౌనో యనుమానము మాకని మెచ్చకుండినన్.

అవనినాథుఁడు బౌద్ధుల నాగ్రహించి
'చివరి కొక్క పరీక్ష నేఁ జేయువాఁడ,
గెలుచువారల మతముర్వి వెలయు నింక
నోడి పోయిన మూర్ఖుల నుత్తరింతు".

అనుచు శపథ మొనర్చి ఘటాంతరమున
చిలువ నొకదాని నుంచి వాసెన బిగించి
"తెలియఁజెప్పుఁడు మీ బుద్ధిబలము మీఱఁ
గుండలో నున్న వస్తువుఁ గొదుక" కనిన.

విప్రవర్యులు తేపటివేళఁ జెప్ప
ననుమతింపుఁ డటంచు రాజాజ్ఞఁ బొంది,
అంత వఱువాత భాస్కరోపాస్తివలన
బౌద్ధులను గెల్చు తంత్రము పడసి రంట.

బౌద్ధులు కుండలోపలిది పాముని పల్కఁ గుమారిలాదు ల
త్యుద్ధతి భోగితల్పుఁడు పయోజదళాక్షుఁడటంచుఁ బల్కఁగా
పద్ధతి సత్య మాయె నల భాస్కరదేవు ననుగ్రహంబుచే
నిద్ధర శ్రౌతధర్మము మహేశ్వరునాదృతి చూఱలాడఁగన్.

ఘటములో నిద్ర దందశూకంబు మీఁద
శ్రీ రమాభర్త గొలువున్న చెలువు గాంచి
బౌద్ధ విజ్ఞానము నెడందఁ బ్రస్తుతించి
బ్రాహ్మణుల వింతమహిమ కబ్బపడె నృపుఁడు.

తన యొనరించినట్టి శపథంబు వృథా చనరామి బౌద్ధులన్
జనపతి చంపఁజేసెను దృషన్మయ యంత్ర నిపాతితాంగులన్
బొనరిచి! తేని యానతి మనోరథముల్ ఫలియింప బౌద్ధ నా
శనమున కుబ్బి శ్రౌత మత సంపద నింపిరి విప్రు లెల్లెడన్.

ఇట్టి మతవిప్లవాగ్ను లెన్నెన్ని రగిలి
బౌద్ధమును దేశమున బూది పాలొనర్చె
నో" చరిత్రి యెఱుంగు, మహోగ్ర మూర్తి
కాలపూరుషుఁ డెఱుఁగు వే యేల వినుఁడి!

♦ ♦ ♦

ఒక్కచోటటి దిక్కు లొలసి సముజ్జ్వలించు
బౌద్ధుల విహారవాటి యిప్పట్టణంబు;
ఒక్కచోటటి సొంపుచెడి గుండె వ్రక్కలించు
శవ నివాసోగ్ర భయద శ్మశాన వాటి.

ఇచ్చోట తొంటి యాంధ్రేశ్వరు ల్వసియించు
సింహాసనములు విచ్ఛిన్నములుగ
ఇచ్చోట తెలుఁగు శిల్పిశానులు సృజించు
దివ్య శిల్పములు విశీర్ణములుగ

ఇచ్చోట సాంధ్ర పూర్ణేందు నిభాస్యల
    వింత చెల్వములు దుఃఖాంతములుగ
ఇచ్చోట తెలుఁగుల యుద్ధనాగరికతా
    ముద్రాంకములు వినిర్మూలములుగ
ఇచట బౌద్ధ మునీంద్ర మహిష్ఠ ధర్మ
బోధ లన్నియు గాలి కబుర్లు గాఁగ
శాప మిడి నా తెలుంగుల సంపదలను
లయ మొనర్చితి వేమి వేశాతపస్వి !

అది యహింసాదేవు నాకారమా ! గండ్ర
    గొడ్డళ్ళఁ బగులంగఁ గొట్టినారు,
అవి బౌద్ధకథలు రూపందిన మూర్తులా !
    చెవులు ముక్కులు చెక్కి చెఱిచినారు,
అవి బౌద్ధయతుల విహారమందిరములా !
    నేలమట్టము చేసి నిలిపినారు,
అవి సౌగతుల పుస్తకాలయశ్రేణులా !
    కాల్చి బూడిద నేలఁ గలిపినారు,
అవ్వి వికలాంగులై యేడ్చు ననదవాంధ్ర
శరణములె ! అక్కటా ! సుగ్గు సలిపినారు;
అవి "ముసాఫరఖానాలె !" అగడిమున
"పాయిఖానాలు"గా మార్చి వాడినారు.

ఏ క్రూరకాలాన నిట బౌద్ధ వైదిక
మతములు పేర్చి సమ్మర్దపడెనొ,
ఏ దుర్ముహూర్తాన నిట మతద్వేషమ్ము
పాటించెనో రక్త వాహినులను,
ఏ చెడ్డరోజులం దీ సుందరస్తూప
మగలించిరో మారణాయుధముల,
ఏ పాడుప్రొద్దులం దీ రాజధానిచే
అగ్ని హోత్రుఁడు తృప్తి నార్చుకొనెనొ,
ఏ విషమ వేళయందున నిచ్చ టాంధ్ర
రాజరాజ కిరీట చిరత్న రత్న
సంతతులు నేల రాలె నా సమయ మెన్న
దారుణక్రూర యమరాజ దంష్ట్ర యేమొ.

ఇచ్చట బౌద్ధజాతి నణికించిరఁటే మును, సూదు లక్షలం
గ్రుచ్చిరఁటే, శిరూత్కరము కొంకక కుత్తుక లొత్తినారఁటే,
చిచ్చునఁ గాల్చి చంపిరఁటె చేడియలన్న తలంపు లేకయే,
పిచ్చిమతాభిమాన మెదఁ బేర్చుటచే మన హైందవోత్తముల్.

ఈ రమణీయశిల్పముల నిట్టుల ముక్కలు చేసి యీసు చ
ల్లారఁగ నిండ్లమెట్లుగ, గృహావరణమ్ములఁ గాళ్ళ తాలుగాఁ
జేరిచిరా కటా ; యెదఁద భిన్నమగుంగద బౌద్ధ సత్కళా
మారణకార్యము ల్దలఁచుమాత్రఁ గఠోర శిలాళి కేనియున్.

బౌద్ధ మతచిహ్న మన్న దే పాటి యున్నఁ
బొడిపొడి యొనర్చి కృష్ణమ్మకడుపులోనఁ
బాఱ వేయక నిద్దుర పట్ట లేదు
నాఁటి సౌగత ధర్మ వినాశకులకు.

మతము బౌద్ధమె యైన సంపదలు తెల్గు
దేశ జననివి కావొ, తదీయ సుతులు
సోదరులు కారొ, భేదమ్ము పాదుకొల్పి
తల్లికడుపున చిచ్చిడం దగు నఁటోయి।

హైందవ మతానుచరుల దౌష్ట్యమ్ము కతన
చితికి పోయిన బౌద్ధుల శిల్పలక్ష్మి
ముసలిమానుల దుండగమ్ములకు లోఁగి
నామ మాత్రావ శేష మైనది గదన్న ।

ఈ శిలాభోగమహిమ జీర్ణించి చెదఱె,
ఈ కళా వైభవమ్ము నశించిపోయె,
ఈ నగర భాగ్యరమ తిరోధాన మంది,
యేల మిగిలెనొ నేఁడు దీపాలదిన్నె।

చెదఱి జీర్ణించి కూలి నశింప మిగిలి
రూపు గోల్పడనట్టి యీ స్తూప కృతులు
ఉన్న వొకకొన్ని 'మద్రాసు మ్యూజియము'నఁ
గళల కెదమెచ్చు ప్రభువుల చలువ కలిమి.

కృష్ణాతరంగ సంగీత విభ్రమములో
వినుపింపదే మాంధ్ర విభుల చరిత ?
జీర్ణించియున్న యీ చిన్ని రెండూళ్ళలో
పొటమ దేమీ ధాన్యకటక మహిమ ?
ఏపారియున్న యీ దీపాలదిన్నెలో
దరిసెనం బీడేమి ధర్మరాజు ?
పూర్వాంధ్రలక్ష్మి దోబూచు లాడిన వీట
కులుకవేమీ నేఁడు తెలుఁగుసిరులు ?
మతవిరోధుల ఘోర కర్మములకతన
కాలపురుషుని పటు దురాగ్రహామువలన
పాడుపడిపోయె నా నాఁటి బౌద్ధమహిమ!
అస్తమించిన దా నాఁటి యాంధ్రభూతి.

గౌతమీసుత శాతకర్ణ ప్రతాపంబు
కసి మసంగదు శత్రుగణము నేఁడు
పులమావి వాసిష్ఠిపుత్రు బాహాశక్తి
వహియింప దాంధ్ర భూభరము నేఁడు
శాలివాహన కవి చక్రవర్తి కవిత్వ
రసము లూరవు తెల్గువసుధ నేఁడు
ఆ మహాదేవ బౌద్ధాచార్య మతబోధ
విస్తరిల్లదు తెల్గువీట నేఁడు
శిల్పి నాగార్జు నాచార్య సిద్ధ వర్యు
శిల్ప వైద్యక యోగాది సిద్ధులన్ని
వెలయ వీ నాఁడు బౌద్ధ విద్వేషవహ్ని
ప్రబలుటం జేసి యాంధ్ర ప్రపంచమందు.

ధాన్యకటక పురీ సభ్యతా విభూతి
కడుపులో జీర్ణమగుడు నాఁకటికి డస్సి
విలపన మొనర్చు నీ కృష్ణవేణి యిపుడు
తొంటి పస చెడ్డ సోమరాంధ్రులను గలసి.

బుద్ధుఁ డమరేశ్వరుం డెట్టి పోరపు లేక
యైకమత్యము సుఖ శాంతు లతిశయిల్ల
జనత యొనరించు పూజ లందిన దినములు
కలవఁటే కొన్ని సుమధుర క్షణము లవ్వి!

అప్పుడు బౌద్ధ హైందవ జనావళి చేతులు గల్పి శాంతిలో
నొప్పుల దోఁగి సభ్యుల నుతుల్గొని దేశ వివృద్ధికోసమై
యప్పన చేసినా రఁట నిజాఖిల సంపదలన్ దృణంబుగాఁ
జెప్పెడు నాఁటి వైభవము చిత్త మిగుర్పఁగ శాసనాంకముల్.

అది బౌద్ధప్రళయమ్ముగా జనులు వ్యాఖ్యానించుచున్నారు, నే
నది శిల్పప్రళయమ్ముగాఁ దలఁతు, సత్యం బిద్ది; కాదేని నె
మ్మది కానందము గూర్చు శిల్పకృతు లమ్మాడ్కిన్ వృథాపుత్తు రా
యెద నూహింపఁడు బౌద్ధవైరము కళల్ హింసింపఁ జాలునే!

మత విద్వేష పిశాచ మావహిలి దుర్మానంబు పాటించి యే
వెతలం బెట్టిన బౌద్ధజాతిని, గళా విధ్వంసకుల్ గానిచో
శ్రుతివాదుల్ మన యాంధ్రసంతతికి మెచ్చుం గూర్పరే యేటికీ
గతి విద్వజ్జన గర్హ్యకార్యములు శంకాదూరులై చేయుటల్.

మత వైరమ్మ లోకప్పు కాలవశతం బాటిల్లఁగా కైనను
ద్ధతులై జాతికి జీవగఱ్ఱ లగు గ్రంథశ్రేణులఁ శిల్ప స
త్కృతులఁ నాశ మొనర్తురా! మనుజులఁ హింసింతురా! యిట్టిదు
ష్కృతముల్ రూపటి దేశమెల్లెడ సుఖశ్రీ శాంతు లోలాడుతఁ!

అ మ రే శ్వ రా ల య ము

ఈ యమరేశ్వరాలయ మదే సుముహూర్తమునం బ్రతిష్ఠితం
బై యెసలారెనో యెఱుఁగ మప్పటినుండియు నాంధ్రధారణీ
నాయక గౌరవాదృతు లనారత మందుమ నీ ధరాప్రజా
ధ్యేయత భక్తకోటి కొక దివ్య మహాస్థలమై చెలంగెడున్.

ఆ కోటకేత రాజాగ్రణి గై సేయు
శిల్ప నిర్మితిఁ గళాశ్రీ గడించి
అల కొండవీటి ధరాధినేతల మేలి
సేవలలోఁ గ్రొత్తచెలువ మొలికి
శ్రీ కృష్ణరాయ ధరిత్రీ ధవుని చేతి
యపరంజిపూల సమర్చ లంది
మా వాసిరెడ్డి క్షమానాయకుని పున
ర్నిర్మాణ కళల వన్నియలఁ గ్రక్కి
తెలుఁగు దేశమునందు వర్ధిల్లినట్టి
యంచితంబగు నారామ పంచకమున
నొకటిగాఁ బేరు గాంచె సుప్రకట మైన
శ్రీమ దమరేశ్వరాలయ క్షేత్ర మవని.

అది యొకప్పుడు బౌద్ధదేవాలయ మఁట!
ఇప్పు డమరేశ్వరస్వామి కిరవు సూవె!
అగపడుచునుండు బౌద్ధచిహ్నములు గుడిని
వెదకి చూడ పురాతత్త్వ విదుల కిపుడు.

♦ ♦ ♦

ఓ యమరేశ! తావక మహోగ్ర లయోద్ధుర తాండవంబులో
నీ యమరావతీ విభవ మెల్లఁ బదాహతిఁ బాడొనర్చితే,
మాయమొనర్చితే భువనమాన్య మహాంధ్ర కళేందిరా పద
చ్ఛాయలు నైత మే యఘము సల్పిరి మా తెలుఁగుల్ జగత్ప్రభూ!

కరుణాసాంద్రుఁడ వీవు, బుద్ధగురుడుం గారుణ్య పాథోధి-మీ
పరమస్నేహము తెల్గుదేశమున కాపాదించె నైశ్వర్యముల్;
మఱల న్నేఁడు పురాణ హైందవ కళా లక్ష్మీ విలాసోన్నతుల్
మెఱయింపం గయికల్పుఁ డిర్వురును స్వామీ! మానమస్కారముల్.

—o—

వివరణములు

పుటలు :

35. విశ్వకర్మ, మయుఁడు, త్వష్ట, మనువు - వైదిక పౌరాణిక వాఙ్మయములో ప్రసిద్ధి గన్న శిల్పప్రవర్తకులగు ఋషులు, బ్రహ్మలు.

40. పంచవిధాదిమ శక్తులు : ఆదిశక్తి, పరాశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి.

41. పంచ కల్యాణములు : బుద్ధోదయము, మహాభి నిష్క్రమణము, మార ప్రధ్వంసనము - లేక, సంబోధి; ధర్మచక్ర ప్రవర్తనము, మహాపరి నిర్వాణము.

52. శాలివాహనుఁడు కుంభకార కులమువాఁడను లోకప్రసిద్ధి యను సరింపఁబడినది.

54. నాగార్జునుని కొండకు శ్రీగిరి యనియు చరిత్ర ప్రసిద్ధి గలదు.

59. మహాయానబౌద్ధులు పవిత్రములుగా భావించు "నవధర్మములు" అను బౌద్ధగ్రంథములు:-గంత వ్యూహము, అష్టసాహస్రిక, ప్రజ్ఞాపారమిత, దశభూమీశ్వర, సమాధిరాజ, లంకావతార, సద్ధర్మపుండరీక, లలిత విస్తర, సువర్ణ ప్రభాసములు.

60. సుధన్వ మహారాజు సభలో కుమారిలభట్టు బౌద్ధుల నోడించి నశింపజేసిన గాథ సంస్కృతములోని "శంకర విజయము" నుండి గ్రహింపఁ బడినది.

68. ఆరామపంచకము : అమరారామము. క్షీరారామము. దాక్షారామము. భీమారామము. కుమారారామము.

వైదికులు : వేదమతానుసారు లగు హైందవులు. పంచార్షేయులు : సానగ, సనాతన, అహభూన, ప్రత్న, సుపర్ణులనెడి వేదప్రసిద్ధ పంచబ్రహ్మ ఋషుల వంశమునఁ బుట్టిన విశ్వబ్రాహ్మణులు, లేక శిల్పబ్రాహ్మణులు.

గ్రంథముద్రణకు సహకరించిన ఉదారులు

—o—

శ్రీ తుమ్మనపల్లి లింగయ్య పురుషోత్తం బ్రదర్సు.
జగిత్యాల రు. 600

శ్రీ ముదికిపూడి సూర్యకోటేశ్వరరావుగారు
7/509, రాజుపేట మచిలీపట్నం. రు. 116

శ్రీ పావులూరి వెంకయ్యచౌదరి బుల్లెమ్మగారలస్మారకార్థం
శ్రీ ఉప్పల శ్రీమన్నారాయణ వసుంధరాదేవిగారలు.
గోవాడ. రు. 116

శ్రీ కాసర్ల మాధవాచార్యులుగారు 15–1–590
సిద్ధింబర్ బజారు, నారాయణగూడ, హైదరాబాద్. రు. 58

శ్రీ వీరరాఘవ గ్రంథావళి

—o—

1. యోగదర్శనము. రు. 15–00
2. శిల్పదర్శనము. ,, 12–00
3. వీరరాఘవ వ్యాసావళి. ,, 12–00
4. మిత్రసాహస్రి. ,, 12–00
   (నీతి వేదాంత ప్రతిపాదకములైన ఆటవెలదులు)
5. లేపాక్షి (చారిత్రక నవల) ,, 6–00
6. మోహనాంగి ,, ,, 7–00
7. మనగురుదేవుడు (బ్రహ్మంగారి సంగ్రహచరిత్ర) ,, 5–00

పునర్ముద్రణము కావలసినవి

1. ఆత్మదర్శనము (తత్త్వశాస్త్రము)
2. తోరణము (ఖండకావ్యము)
3. శిల్పకళా క్షేత్రములు (1,2, భాగములు)
4. మూడుకావ్యాలు (రామాయణ,భారత,భాగవతముల సమీక్ష)
5. కళారాధన (జక్కణాచార్య చరిత్ర-నవల)
6. నిరంజన విజయము (కీ.శే. వ. నిరంజనశాస్త్రిగారి జీవితము)
7. ఆసియాజ్యోతులు (బుద్ధ, క్రీస్తు, మహమ్మదు, మహాత్ముల జీవితములు)
8. వీరబ్రహ్మ సుప్రభాతమ్.
9. విశ్వకర్మాష్టకమ్.

సవరణలు

పుట.	పంక్తి	ఉన్నది	ఉండవలసినది
3	7	శిల్పకాళాభిరతీ	శిల్పకళాభిరతీ
9	5	విశ్వవిద్యాలయములు	విశ్వవిద్యాలయములు
22	5	తెలుఁగుసంస్కతి	తెలుఁగుసంస్కృతి
42	6	బుద్ధిత్వసిద్ధ	బుద్ధత్వసిద్ధి